

శ్రీనివాసా గోవిందా.. శ్రీ వేంకటేశా గోవిందా!

వేదపండితుల మంత్రోచ్ఛరణ.. భక్తుల గోవిందనామస్మరణల నడుమ ఉదయగిరిలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరుడి కల్యాణం కనులపండువగా సాగింది. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకకు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తజనం తరలిరావడంతో ఉదయగిరి కిక్కిరిసిపోయింది.

- వివరాలు 8లో..

'సోమశిల' నీటిమట్టం

అనంతసాగరం ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతం నుంచి వరద ప్రవాహం కొనసాగుతుండటంతో సోమశిల డ్యాంలో నీటిమట్టం అంతకంతకూ పెరుగుతోంది. శనివారం 15,836 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగగా, జలాశయంలో నీటినిల్వ 38.705 టీఎంసీలకు చేరుకుంది. ఉత్తర కాలువకు 370, వరద కాలువకు 6,000, డెల్టాకు 3,600 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

రేపటి నుంచి ఎస్‌ఏ-1 పరీక్షలు

నెల్లూరు(విద్య), ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో సోమవారం నుంచి ఎస్‌ఏ-1 పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. 2025-26 విద్యా సంవత్సరానికి మొదటి నిర్మాణాత్మక ముదింపు (ఎస్‌ఏఎంపీ-1) పేరుతో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. 1 నుంచి 5వతరగతి వరకు మూడు రోజులు, 6 నుంచి 10వతరగతి వరకు నాలుగు రోజులు పరీక్షలు జరగనున్నాయి. ఈ పరీక్షల్లో ప్రతి సబ్జెక్టుకు 35 మార్కులతోపాటు ప్రతి సబ్జెక్ట్‌లో తరగతి గది ప్రతిస్పందనలు, రాతపనులు, ప్రాజెక్ట్‌పనులకు ఒక్కోదానికి 5 మార్కులు చొప్పున పరీక్ష నిర్వహించి 50 మార్కులకు ముదింపు చేస్తారు. ఈ ఏడాది ప్రత్యేకంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరూ సమాధానాలు రాసేందుకు ప్రతి సబ్జెక్టుకు ఒక బుక్‌లెట్‌ను అందించనున్నారు. ఉపాధ్యాయులు జవాబులను మూల్యాంకనం చేసి ఈ మార్కులను ముదింపు పుస్తకంలోని ఓఎంఆర్‌లో నమోదు చేయడంతోపాటు స్కాన్‌చేసి లీప్ యాప్ ద్వారా అప్‌లోడ్ చేయాలి. ఈ ఫలితాలను రాష్ట్రస్థాయిలో ముదింపు చేసి ప్రస్తుత విద్యా ప్రమాణాలు, చర్యల మీద ఉపాధ్యాయులకు ఉన్నతాధికారులు సూచనలు అందచేస్తారు.

ప్రైవేట్ ఆసుపత్రులకు రిజిస్ట్రేషన్ లేకుంటే చర్యలు

- వివరాలు 8లో



సీఎం చంద్రబాబు సందేశాన్ని వింటున్న మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి, కలెక్టర్ ఆనంద్ ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, భగత్‌సింగ్‌కాలనీవాసులు



అందుకున్న పట్టాలను చూపుతున్న భగత్‌సింగ్‌కాలనీవాసులు

2029 కల్లా ప్రతి ఒక్కరికీ

సొంతిల్లు ఉండాలి

- ఇదే కూటమి ప్రభుత్వ లక్ష్యం
- అసాధ్యాన్ని సుసాధ్యం చేసి చూపాం
- రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు
- భగత్‌సింగ్‌కాలనీ వాసులకు ఇళ్లపట్టాల పంపిణీ
- అమరావతినుంచి వర్చువల్‌గా పాల్గొన్న సీఎం

నెల్లూరు (వెంకటేశ్వరపురం) ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : 2029 కల్లా రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి సొంత ఇల్లు ఉండాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు స్పష్టం చేశారు. శనివారం నెల్లూరులోని భగత్ సింగ్‌కాలనీవాసులకు మంత్రి నారాయణ ఆధ్వర్యంలో ఇళ్లపట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వర్చువల్‌గా పాల్గొని ప్రసంగించారు. ముందుగా సీఎం ఆదేశాల మేరకు ఎంపీ వేమిరెడ్డి, మంత్రి నారాయణలు సయ్యద్ సబిహా, షేక్.మస్తానమ్మలకు పట్టాలు అందజేశారు. ఇదే సమయంలో లబ్ధిదారులందరికీ ఒకే సమయంలో సచివాలయ సిబ్బంది పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ రాఖీ పండుగ వంటి పవిత్రమైన రోజు 633 మంది పేద మహిళలకు శాశ్వత ఇంటి పట్టాలు పంపిణీ చేయడం ఎంతో సంతోషాన్ని, సంతృప్తిని కలిగించడంతో పాటు అదృష్టంగా భావిస్తున్నట్టు చెప్పారు. అసాధ్యాన్ని.. సుసాధ్యం చేసి చూపామన్నారు. ప్రభుత్వ స్థలాల్లో ఏళ్లతరబడి నివాసాలు ఉంటూ పట్టాలు లేని పేదలను గుర్తించి పట్టాలు అందజేయాలని ఎమ్మెల్యేలకు ఆదేశాలు ఇచ్చామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసి చూపామన్నారు. ఈ నెల 15 నుంచి రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలపారు. ఇలాంటి అనేక కార్యక్రమాలు రాష్ట్రంలో అమలు చేయగలుతున్నామంటే అందరి ఆశీర్వాదం వల్లే సాధ్యమవుతుందన్నారు. అనంతరం మంత్రి నారాయణ మాట్లాడుతూ పెన్నానది తీరంలో ఉన్న భగత్‌సింగ్‌కాలనీ ప్రజలకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు పట్టాలు అందజేసినట్లు చెప్పారు. ఇదేవిధంగా నెల్లూరు నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రజలు పట్టాలు ఇప్పించాలని కోరుతున్నట్లు తెలియజేశారు. త్వరలోనే పరిశీలించి ఎలాంటి వివాదాలు లేకుండా ఉంటే వారందరికీ పట్టాలు అందజేస్తామన్నారు. కాగా థాంక్యూ సీఎం సార్ అంటూ ప్లకార్డులతో లబ్ధిదారులు నినాదాలు చేశారు. ఎంపీ, మంత్రి చేతుల మీదుగా టీడీపీ నాయకులు జహీర్, జమీర్ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి, అందరికీ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి, కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్, కమిషనర్ నందన్, ఆర్డీవో అనూష, తహసీల్దారు షఫీమాలిక్, టీడీపీ నాయ కులు విజయభాస్కర్‌రెడ్డి, అనూరాధ, రూప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఉదయగిరికి చేరుకున్న సెల్వన్ సైకిల్‌యాత్ర

పర్యావరణం కోసం ఓ యువకుడి సాహసయాత్ర

- మూడున్నరేళ్లుగా సైకిల్ తొక్కుతూ..
- ఊరూరా తిరుగుతూ
- ఉదయగిరికి చేరుకున్న తమిళ తంబి

పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా.. ప్రాణవాయువు అందక ఎవరూ మృతి చెందకూడదన్న లక్ష్యంతో ఆ యువకుడు సైకిల్ యాత్ర ప్రారంభించాడు. మూడున్నరేళ్లగా సైకిల్ తొక్కుతూ విద్యార్థులు, ప్రజలకు పర్యావరణం ప్రాధాన్యతను వివరిస్తున్నాడు. అంతేకాదు.. వారితోపాటు తనూ మొక్కలు నాటుతున్నాడు. అలా ఊరూరా సైకిల్ తొక్కుతూ శనివారం ఉదయగిరికి చేరుకున్నాడా యువకుడు. ఈ సందర్భంగా ఆయన్ను 'ఆంధ్రజ్యోతి' పలకరించింది. తన పేరు ముత్తు సెల్వన్ అని, తమిళనాడులోని కోయంబత్తూరుగా చెప్పుకొచ్చారు. కొవిడ్ సమయంలో ఆక్సిజన్ అందక చాలామంది మృత్యువాతపడటం తనను కలచివేసిందని అన్నారు. దీంతో పర్యారవణంపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో 2021, డిసెంబరు 21వ తేదీన సైకిల్ యాత్ర ప్రారంభించినట్లు చెప్పారు. ఇప్పటివరకు మూడు రాష్ట్రాల్లో తిరిగానని, పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించి 8 లక్షల మొక్కలు నాటినట్లు తెలిపారు. దేశంలో అన్ని రాష్ట్రాలతోపాటు ప్రపంచంలోని మరో ఏడు దేశాల్లో తన సైకిల్ యాత్ర కొనసాగించనున్నట్లు తెలిపారు. 2028లో తన యాత్ర ముగుస్తుందని అన్నారు. పర్యావరణ పరిక్షణకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.

- ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి)

ఇక హాస్టళ్లకూ

మార్కులు!

- ఫలితాలు పెంచడమే ధ్యేయం
- ఈ విద్యా సంవత్సరం నుంచే అమలులోకి..

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : సంక్షేమ హాస్టళ్లలో మెరుగైన ఫలితాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. హాస్టళ్ల మధ్య పోటీతత్వాన్ని పెంచి ప్రగతి సాధించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందుకోసం

- మిగతా 7లో



హాస్టల్‌లో భోజనం చేస్తున్న విద్యార్థులు

- 61 ఆలయాలకు కొత్త కమిటీలు
- నోటిఫికేషన్ జారీతో ఆశావహుల్లో ఆనందం
- ఇప్పటికే నేతల వద్దకు క్యూ
- పెద్ద ఆలయాలకు పెరుగుతున్న పోటీ

నామినేటెడ్

కోలాహలం

నెల్లూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సమయం రానే వచ్చింది. ఎన్డీఏ కూటమి పార్టీల్లో నామినేటెడ్ పదవుల పందేరం మొదలైంది. ఇప్పటికే వ్యవసాయ మార్కెట్ కమిటీలు, డీసీసీబీ, డీసీఎంఎస్, సాగునీటి సంఘాలు వంటి నామినేటెడ్ కమిటీల నియామకం పూర్తవగా ఇప్పుడు దేవాలయాల వంతు వచ్చింది. ఏకంగా జిల్లాలో 62 దేవాలయాలకు కొత్త పాలకవర్గాలను నియమించేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్లు విడుదల చేసింది. దాదాపు 650 మందికిపైగా ఈ కమిటీల్లో చోటు దక్కనుంది. దీంతో ఆయా పార్టీల్లో ఆశావాహుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. అదే సమయంలో ఈ దఫా ఆలయ పాలకవర్గాల్లోకి నాయీ బ్రాహ్మణులు, బ్రాహ్మణులకు కూడా చోటు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడంతో ఆ వర్గాల్లోనూ సందడి కనిపిస్తోంది.

45 చిన్నవి.. 17 పెద్దవి

జిల్లాలో ఉన్న ప్రధాన ఆలయాలన్నిటికీ నూతన పాలకవర్గాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో జిల్లాలోని 62 ఆలయాలకు నోటిఫికేషన్లు విడుదల చేసింది. అందులో 45 చిన్న ఆలయాలు, 17 పెద్ద ఆలయాలు ఉన్నాయి. సంవత్సర ఆదాయం రూ.25 లక్షల్లోపు ఉన్న 45 ఆలయాలకు సంబంధించి గత నెలలో నోటిఫికేషన్ విడుదల కాగా, ఆదాయం రూ.1 కోటిపైగా ఉన్న ఆలయాలకు తాజాగా నోటిఫికేషన్ విడుదలైంది. చిన్న ఆలయాలకు గానూ ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ముగిసింది. పెద్ద ఆలయాలకు సంబంధించి పాలకవర్గ సభ్యుల కోసం దరఖాస్తులను మరో 20 రోజుల వరకూ స్వీకరించనున్నారు. చిన్న ఆలయాల కమిటీల్లో మొత్తం 10 మంది సభ్యులుగా ఉంటారు. పెద్ద ఆలయాల్లో ఈ సంఖ్య 12 ఉంటుంది. వీరిలో ఒకరిని చైర్మన్‌గా ఎన్నుకుంటున్నారు. ఈ లెక్కన చూసుకుంటే మొత్తం 62 ఆలయాలకు 650మందికిపైగా పాలకవర్గ సభ్యులుగా నియామకం కానున్నారు. వీరిలో 50 శాతం మహిళలు ఉండడం విశేషం.



వలేటివారిపాళెం : మాలకొండలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయ ప్రధాన ముఖద్వారం

అధికార పార్టీల్లో సందడి

సాధారణంగా ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి సంబంధించిన అర్హులైన వారిని ఆలయ పాలకవర్గాల్లో నియమిస్తుంటారు. కొన్నిచోట్ల ధార్మిక సంస్థలకు చెందిన వారికి, ఆధ్యాత్మిక సేవకులకు కూడా చోటు కల్పిస్తుంటారు. ఇప్పుడు ఒకేసారి అన్ని ఆలయాలకు నోటిఫికేషన్లు వెలువడటంతో కూటమి పార్టీలైన టీడీపీ, జనసేన, బీజేపీల్లో సందడి నెలకొంది. ప్రజాప్రతినిధుల ఇళ్లు కోలాహలంగా మారాయి. అందులోనూ పెద్ద దేవాలయాలకు పోటీ ఎక్కువగా కనిపిస్తోంది. జిల్లాస్థాయి నేతలు ఈ ఆలయాల చైర్మన్ పదవుల కోసం గట్టిగా ప్రయత్నాలు చేసుకుంటున్నారు. చిన్న ఆలయాలకు మాత్రం ఆయా ప్రాంతాల్లోని వారినే నియమించే ఆలోచన జరుగుతోంది. వచ్చే నెలాఖరులోపు ఈ నామినేటెడ్ పదవుల భర్తీ పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయి.

వెంకన్న సన్నిధిలో తన బిడ్డకు పుట్టివెంట్రుకలు తీయించేందుకు ఆ కుటుంబం ఉత్సాహంగా బయలుదేరింది. చిన్నారితో కబుర్లాడిన వారంతా అలసిపోయి అప్పుడే కునుకు తీశారు. అర్ధరాత్రి కావడంతో రోడ్డంతా చిమ్మచీకటి. త్వరగా గమ్యం చేరాలన్న ఉద్దేశంతో డ్రైవర్ కూడా వాహన వేగం పెంచాడు. ముందు వెళుతున్న లారీని అధిగమించబోయింది. అంతే ఒక్కసారిగా కుదుపు. వారు ప్రయాణిస్తున్న వాహనం నడిరోడ్డుపై తలకిందులైంది. హాహాకారాలు. తేరుకునేలోపు కుటుంబంలో ఇద్దరు అన్నదమ్ములు భార్యలను కోల్పోయారు. ముక్కుపచ్చలారని బిడ్డతోపాటు నానమ్మ, వియ్యంకుడిని మృత్యువు పొట్టన పెట్టుకుంది. శనివారం తెల్లవారుజాము 2 గంటల ప్రాంతంలో ఉలవపాడు హైవేపై ఈ ఘటన చోటు చేసుకుంది.



ప్రమాదానికి కారణమైన తుఫాన్ వాహనం

మొక్కు తీర్చుకోకనే..!

- 11 మంది కుటుంబ సభ్యులతో తిరుమలకు పయనం
- మార్గమధ్యంలో కబళించిన మృత్యువు
- ముందు వెళుతున్న లారీని ఢీకొని 'తుఫాన్' వాహనం బోల్తా
- ఘటనాస్థలిలో ఇద్దరు, ఆసుపత్రిలో ముగ్గురు దుర్మరణం
- మృతుల్లో తోడికోడళ్లు, అత్త, వియ్యంకుడు, మూడేళ్ల చిన్నారి
- ఉలవపాడు వద్ద జాతీయరహదారిపై ఘోరం

ఉలవపాడు/మాచవరం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : పల్నాడు జిల్లా మాచవరంలోని గణేశునిపాడు గ్రామానికి చెందిన నంబుల వెంకటేశ్వర్లు, సుభాషిణిల కుమారుడు అభిరామ్‌కు (3) తిరుమలలోని శ్రీ వేంకటేశ్వరుడి సన్నిధిలో పుట్టివెంట్రుకలు తీయించాలని భావించారు. ఈ నేపథ్యంలో కుటుంబ సభ్యులతో తుఫాన్ వాహనంలో శుక్రవారం రాత్రి తిరుమలకు బయలుదేరారు. వెంకటేశ్వర్లు కుటుంబంతోపాటు తమ్ముడు శ్రీనివాసులు, ఈయన భార్య రుక్మిణి, వియ్యంకుడు శ్రీనివాసరావు మొత్తం 11 మంది బయలుదేరారు. మార్గమధ్యంలోని ఉలవపాడు మండలం చాగొల్లు జాతీయ రహదారి వద్దకు వచ్చేసరికి ముందు వెళుతున్న ఇనుములోడు లారీని అధిగమించబోయి లారీని వెనుక భాగాన్ని తుఫాన్ వాహనం ఢీకొంది. ఈ ధాటికి వాహనం ఎడమ వైపు చక్రం ఊడిపోవడంతో ఒక్కసారిగా అతివేగంతో రోడ్డుపై బోల్తా కొట్టింది. రోడ్డుకు గుద్దుకున్న భాగం వైపు ఉన్నవారికి తీవ్ర గాయాలై శరీర భాగాలు తెగి రోడ్డుపై పడ్డాయి. రుక్మిణి (28) ఎడమ చెయ్యి తెగిపడింది. చిన్నారి అభిరామ్ అపస్మారక స్థితిలోకి వెళ్లగా, తల్లి సుభాషిణి (30), నానమ్మ వెంకట నరసమ్మ (55) ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. తాత ఎర్రం శ్రీనివాసరావు(60)కు తీవ్ర గాయాలైయ్యాయి. విషయం తెలుసుకున్న వెంటనే సీఐ అన్వర్ బాషా, ఎస్ఐ అంకమ్మ, హైవే మొబైల్ పోలీసులు హుటాహుటిని ఘటనాస్థలికి చేరుకున్నారు. క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో కావలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడు చికిత్స పొందుతూ చిన్నారి అభిరామ్ మృతి చెందాడు. శ్రీనివాసరావు, రుక్మిణిలను మెరుగైన వైద్యం కోసం నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం ఉదయం రుక్మిణి, మధ్యాహ్నం శ్రీనివాసరావు మృతి చెందారు. నెల్లూరు నుంచి రుక్మిణి, కావలి ఆసుపత్రి నుంచి చిన్నారి అభిరామ్ మృతదేహాలను ఉలవపాడు సీహెచ్‌సీకి తరలించి శనివారం సాయంత్రానికి నలుగురు మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆసుపత్రి ప్రాంగణమంతా బాధిత బంధువులు, కుటుంబ సభ్యుల రోదనలతో నిండిపోయింది. జరిగిన రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అంకమ్మ తెలిపారు.



ఘటనాస్థలిలో రోడ్డుకు అడ్డంగా పడి ఉన్న తుఫాన్ వాహనం

ప్రాణాలతో బయటపడిన చిన్నారి

మృతి చెందిన సుభాషిణి కొత్తగణేషునిపాడు గ్రామంలో సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పని చేస్తుంది. ఆమె భర్త వెంకటేశ్వర్లు పిడుగురాళ్ల మండలం అగ్రహారంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. వీరి తొమ్మిది నెలల పాప ప్రాణాలతో బయట పడగా భార్య, తల్లి, వదిన, మామ చనిపోవడంతో ఆయన ఆవేదనకు అంతు లేకుండా పోయింది.

డ్రైవర్ నిద్రే కారణమా!?

తుఫాన్ వాహనం సత్తెనపల్లికి చెందిన వారిది. ఈ వాహనాన్ని రామ్మూర్తి అద్దెకు మాట్లాడుకున్నారు. అయితే రాత్రి ప్రయాణం కావడంతో డ్రైవర్ నిద్రలోకి జారి ఉంటాడని ఇదే ప్రమాదానికి కారణమని కొందరు అనుమానిస్తున్నారు. వేగంగా వెళ్తుండగా రోడ్డు పక్కన నిలబడి ఉన్న లారీ కన్పించకపోవడంతో అయినా ప్రమా దం జరిగి ఉంటుందని మరికొందరి వాదన.

బాధితులకు పరామర్శ

విషయం తెలుసుకున్న గురజాల మాజీ ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి బాధిత కుంటుంబ సభ్యులను శనివారం ఉలవపాడు ఆసుపత్రికి వచ్చి పరామర్శించి ధైర్యం చెప్పారు. పోస్టుమార్టం త్వరగా నిర్వహించి మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించాలని డ్యూటీ డాక్టర్ ఐశ్వర్యతో మాట్లాడారు.



మృతులు శ్రీనివాసరావు, సుభాషిణి(ఫైల్)

వీరాంజనేయ స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు

కోవూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో శనివారం పవిత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శ్రీ వీరాంజనేయుని మూలవిరాట్టుకు పూలంగి సేవ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన పల్లకీ సేవలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ పూజారి జనార్దనం నాగరాజాచార్యులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలు, పుష్పాలతో అందంగా అలంకరించారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 9728
వెండి కిలో ధర	రూ. 118600
వెండి ఒక గ్రాము	రూ. 121.60

చల్లా యానాదులకు జనన ధ్రువీకరణ పత్రాలు



చల్లా యానాదులతో కొండాపురం కస్తూరి

రాపూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాయిబాబా ఆలయం వెనుక ఉన్న సుమారు 40 మంది చల్లా యానాదు లకు జనసేన పార్టీ చొరవతో జనన ధ్రువపత్రాలను శనివారం సచివాలయంలో అధికారులు అందచేశారు. ఈ సందర్భంగా రాపూరు జనసేన పార్టీ మండల అధ్యక్షురాలు కొండాపురం కస్తూరి మాట్లాడుతూ త్వరలో వీరికి ఆధార్‌కార్డులు, కాలనీ ఇళ్ల సమకూర్చే విధంగా ప్రయత్నిస్తానని తెలిపారు.

చేదెక్కిన చెరకు

ఒకప్పుడు 1500 ఎకరాల్లో సాగు
సూదలగుంట ఫ్యాక్టరీ మూత
రైతులకు బకాయిలు ఇవ్వనందునే...

పొదలకూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : సాగు భారంగా మారడంతో చెరకు పంట చేదెక్కింది. మండలంలో చెరకు సాగు ఒకానొక సమయంలో వెలిగిపోయింది. ఫ్యాక్టరీ యాజమాన్యాల చేతకానితనం, బకాయిలు పెట్టి తప్పించుకోవడంతో ఈ ప్రాంతంలో నేడు పంట లేకుండా పోయింది. ఇప్పటికీ కొందరు సాగుపై ఆసక్తి చూపుతున్నా వీలుకాని పరిస్థితులతో ముందుకు రావడంలేదు. జిల్లాలో అందుబాటులో ఎక్కడా ఫ్యాక్టరీలు లేకపోవడం, బయట ప్రాంతాలకు తోలితే గిట్టుబాటు కాని ధరలతో పెన్నార్ డెల్టా రైతులు చెరకు సాగును మానుకోవాల్సి వచ్చింది. ఒకప్పుడు మండలంలో 1500 ఎకరాల్లో చెరకు ఉండేది. విరుపూరు, సూరాయపాలెం, మహమ్మదాపురం, తాటిపర్తి, నేదురుమల్లి, ముదిగేడు, ఇనుకుర్తి తదితర గ్రామాల్లో సాగు చేసేవారు. పీజీ పట్నం పంచాయతీ పరిధిలో ఉన్న సూదలగుంట షుగర్ ఫ్యాక్టరీ అప్పట్లో పంటను తోలేవారు. గతంలో క్రషింగ్ సీజన్ ప్రారంభమైతే ఆయా గ్రామాల్లో హడావిడి నెలకొనేది. చెరకు కొట్టే కూలీలు గ్రామాలకు చేరుకునేవారు. అయితే ప్రస్తుతం అలాంటి పరిస్థితుల్లేవు. నేడు ఒక్క ఎకరాలో కూడా పంట లేదు.



చెరకు తోట (ఫైల్ ఫొటో)

● భారంగా మారిన చెరకు సాగు...

చెరకు సాగు భారంగా మారడంతో రైతులు క్రమంగా విస్తీర్ణం తగ్గించుకుంటూ వచ్చారు. చివరకు ఒక్క ఎకరాలో కూడా లేకుండా పోయింది. సూదలగుంట షుగర్స్ యాజమాన్యం రైతులకు బకాయిలు చెల్లించకపోవడంతో అధికారులు ఆర్‌ఆర్ యాక్ట్ ప్రయోగించాల్సి వచ్చింది. ఫలితంగా బకాయిల కోసం 2020లో రైతులు ఫ్యాక్టరీ వద్ద ధర్నాలు, ఆందోళనలు చేపట్టారు. దీంతో క్రమంగా సాగుపై మక్కువ తగ్గించుకున్న రైతులు చివరికి పూర్తిగా మానుకున్నారు. సీజన్లలో ఫ్యాక్టరీలో 2 లక్షల టన్నులు క్రషింగ్ చేసే సామర్థ్యం ఉన్నా క్రమంగా చెరకు తోలకాలు తగ్గిపోయి లాకెట్ నాటికి 50వేల టన్నులు కూడా ఫ్యాక్టరీకి వచ్చేది కాదు. దీంతో అది మూతపడి ఉద్యోగులు, కార్మికులు రోడ్డునపడ్డారు. బకాయిల కోసం రైతులు పోరాటం చేయాల్సి వచ్చింది. తర్వాత కేన్ కమిషన్‌తోపాటు కలెక్టర్ చొరవ తీసుకుని నాలుగైదేళ్ల తర్వాత విడతలవారీగా బకాయిలు ఇప్పించగలిగారు.

ఎస్సీ వర్గీకరణ ద్వారా మాదిగలకు ఫలాలు

●ఎమ్మార్పీయస్ నేత ఉదయ్ మాదిగ



జెండా ఆవిష్కరిస్తున్న ఉదయ్ మాదిగ

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ ద్వారా మాదిగలకు అన్ని ఫలాలు అందుతాయని ఎమ్మార్పీయస్ జిల్లా అధ్యక్షుడు ఉదయ్ మాదిగ అన్నారు. బుచ్చి మండలం రేబాల గ్రామం అరుంధతి వాడలో మండల ఎమ్మార్పీయస్ అధ్యక్షుడు దర్శిగుంట శీనయ్య ఆధ్వర్యంలో ఎమ్మార్పీయస్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉదయ్ మాట్లాడుతూ పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ 2024లో ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టులో వేసిన దావాకు అనుగుణంగానే తీర్పు రావడం సంతోషదాయకమన్నారు. గతంలో మాదిగలకు సరైన రిజర్వేషన్లు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఆ మేరకు మందకృష్ణ చేసిన పోరాటాల ఫలితంగా వచ్చిన ఎస్సీ వర్గీకరణతో మాదిగలకు దక్కాల్సిన ఫలాలన్నీ అందనున్నాయన్నారు. ఆయన సేవలను గుర్తించి పద్మశ్రీ పురస్కారం ఇవ్వడం హర్షణీయమన్నారు. ఎస్సీ వర్గీకరణపై మాదిగలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కోవూరు నియోజకవర్గ నేత దర్శిగుంట శ్రీనివాసులు, ఎమార్పీయస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వెంకటరమణయ్య, క్రిష్ణయ్య, సునీల్ పాల్గొన్నారు.

నులి పురుగుల మాత్రల పంపిణీ

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెం పెద్దూరులోని గోపాల కృష్ణయ్య స్కూల్లో 12వ జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా శనివారం స్కూలులో విద్యార్థులకు నులి పురుగుల మాత్రలు పంపణీ చేశారు. ముందుగా కరస్పాండెంట్ నేలనూతల శ్రీధర్, ప్రిన్సిపల్ సురేఖ, ఏఎన్ఎం, ఆశావర్కర్ నాగేశ్వరమ్మలతో పోస్టర్ విడుదల చేశారు.

మిత్రమా.. కుశలమా!?

ముదివర్తిపాలెం పాఠశాలలో ఆత్మీయంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు

ఇందుకూరుపేట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముదివర్తిపాలెంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 70 వసంతాల పూర్వ విద్యార్థుల అపూర్వ ఆత్మీయ సమ్మేళనం శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో 1957వ సంవత్సరం నుంచి 2025 సంవత్సరం వరకు ఈ పాఠశాలలో చదివిన విద్యార్థులందరూ ఎంతో దూరం నుంచి వచ్చి ఇక్కడకు వచ్చిన తమ నాటి ఉపాధ్యాయులను ఆత్మీయంగా పలకరించి వారి ఆశీస్సులు తీసుకొన్నారు. ఈ పాఠశాలలో పాత తరం, కొత్తతరం అనే బేధం లేకుండా అందరూ చిన్న పిల్లలు అయి చిన్ననాటి మధుర స్మృతులను గుర్తుకు తెచ్చుకుని మురిసిపోయారు. ఈ కార్యక్రమంలో మొత్తం 1300 మంది పాత తరం కొత్త తరం విద్యార్థులు, 139 మంది ఉపాధ్యాయ బృందం హాజరవడంతో పాఠశాల ప్రాంగణం కిటకిటలాడింది. ముందురోజు నుంచే పాఠశాలను ముజీర్ ఆధ్వర్యంలో రంగు రంగుల జెండాలతో, సూక్తులతో, 1957వ సంవత్సరం నుంచి 2023 దాకా పదవ తరగతి బ్యాచ్ విద్యార్థుల ఫొటోలతో ఫ్లెక్సీలు వేయడంతో ప్రతి ఒక్కరూ తమ చిన్ననాటి ఫొటోలను చూసి మురిసిపోయారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖాధికారి సునీల్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సదానందం, పాఠశాల చైర్మన్ శేషు కుమార్ హాజరయ్యారు. కార్యక్రమంలో నాటి, నేటి తరం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, నిర్వాహకులు రాఘవేంద్ర, ముజీర్, రంగారెడ్డి, వెంకటరమణయ్య, రవి, సుబ్బారెడ్డి, చాంద్‌బాషా, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పుష్కరిణి పునర్నిర్మాణానికి శంకుస్థాపన

బిట్రగుంట, ఆగస్టు 9 (ఆంధ్ర జ్యోతి): బోగోలు మండలం కొండ బిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వర స్వామి పుష్కరిణి పునర్నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం ఆదివారం నిర్వహిస్తున్నట్లు వేదపండితులు ఈపూరి సత్యనారాయణచార్యులు శనివారం తెలిపారు. స్థానిక టీడీపీ నాయకులు రావి విజయ్ కుమార్ పర్యవేక్షణలో శంకుస్థాపనకు ఏర్పాట్లు చేశారు. ఈసందర్భంగా టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి చొరవతో స్వామి వారి ఆలయాభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. శంకుస్థాపన కార్యక్రమానికి నిర్మాణ దాత ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఎంఎల్సీ బీద రవిచంద్రయాదవ్ హాజరు కానునట్లు ఆయన తెలిపారు. టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులతో పాటు భక్తులు తరలి వచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

12న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

కలిగిరి, ఆగస్టు 9(ఆంధ్ర జ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య వైద్యకేంద్రంలో శనివారం వైద్యాధికారిణి డా. బిజ్జం గీతారెడ్డి జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమానికి సంబంధించి గోడపత్రికను ఆవిష్కరించారు. ఈనెల 12న మండలంలోని పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ఎఫ్ఎస్ మేరీ, సూపర్‌వైజర్ మహాలక్ష్మి, ఫార్మాసిస్ట్ విజయ, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంకు రాఖీ కట్టిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : రాఖీ పూర్ణిమను పురస్కరించుకుని శనివారం సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు శనివారం కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి రాఖీ కట్టారు. ఈ సందర్భంగా సీఎం ఆశీస్సులు అందుకున్నారు. ఆత్మీయ అను బంధాన్ని చాటి చెబుతూ తనకు రాఖీ కట్టిన ప్రశాంతిరెడ్డికి చంద్రబాబు రాఖీ శుభాకాంక్షలు తెలిపారు.

● **విడవలూరు :** అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబును ఊటుకూరు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు బెజవాడ వంశీకృష్ణారెడ్డి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డితో కలసి శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. తనకు కోవూరు వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్‌గా అవకాశం కల్పించాలన్నారు.

ఎంపీ వేమిరెడ్డికి రాఖీ కట్టిన చైర్‌పర్సన్ సుప్రజ



ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి రాఖీ కట్టిన చైర్‌పర్సన్ సుప్రజ, కౌన్సిలర్లు

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు9 (ఆంధ్ర జ్యోతి): నెల్లూరు పార్లమెంటు స భ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి బు చ్చినగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ రాఖీ కట్టి ఆయన ఆశీస్సులు అందుకున్నారు. ఈ సం దర్భంగా ఎంపీ చైర్‌పర్సన్‌కు రాఖీ శుభాకాంక్షలు తెలిపారు. అదే విధం గా ఎంపీకి బుచ్చి నగర పంచా యతీ కౌన్సిలర్లు కోటంరెడ్డి లలిత, అందే ప్రత్యూష, తాళ్ల వైష్ణవి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

111 పొగాకు బేళ్ల కొనుగోలు

కలిగిరి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శనివారం రైతులు మొత్తం 224 పొగాకు బేళ్లు మ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 10 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 111 బేళ్లు కొనుగోలు చేశారు.

గంగమ్మా.. చల్లంగ చూడవమ్మా!

● అంబరాన్నంటిన గంగమ్మ గ్రామోత్సవ సంబరం



గ్రామోత్సవంలో భక్తుల వీరతాళ్లు

పొదలకూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : పొదలకూరు గ్రామ శక్తి స్వరూపిణి శ్రీగంగమ్మ తల్లి కొలుపు మహోత్సవం శనివారం అంబరాన్నంటింది. ఉదయం అమ్మవారి పూజా కార్యక్రమం, పోతురాజు ముగ్గుకి దిష్టి తీర్పు, విద్యుద్దీపాలంకరణ, తప్పెట్లు, కొమ్ముల వాయిద్యాలు, బాణా సంచా వెలుగులు, యాదవ రాజుల వీరతాళ్ల అడుగులతో గంగమ్మతల్లి గ్రామోత్సవం అత్యంత వైభవంగా సాగింది. ఊరేగింపులు, డప్పుల మోతలు, వీరతాళ్లు, చిందులు, పూనకాలు, హారతులు, బైనిడీ వారి కథలతో ఊరంతా ఉత్సవ శోభ సంతరించుంది. మూడు రోజులపాటు వేడుకలు జరగనున్నాయి. గంగా భవానీ ప్రతిమను ప్రత్యేకంగా అలంకరించి వాహనంపై ఊరేగించారు. భక్తులు వారుపోసి, టెంకాయలు కొట్టి అమ్మవారికి స్వాగతం పలికారు. హారతులిచ్చి ఆశీర్వచనాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్దగొల్ల మద్దిరెక్ల నరసింహులు యాదవ్, చైర్మన్ వెంకటేశ్వర్లు, సెక్రటరీ కుమార్, ట్రెజరర్ శ్రీధర్, యరగర్ల జయరామయ్య, అన్నదానపు కృష్ణయ్య, గౌరవాధ్యక్షులు వేమయ్య, గోమసాని వేణు, పీవీఎస్ ప్రసాద్‌యాదవ్, గోళ్ల పద్మనాభం, కండే వాసు, పద్దాల రాము, కొల్లిబోయిన వెంకటేశ్వర్లు, భాస్కర్, వాకా శివ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం అందజేస్తున్న వైద్యాధికారి, దాతలు

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు9 (ఆంధ్రజ్యోతి): గర్భిణిలు, బాలింతలు ఆరోగ్యంగా ఉండాలన్న ఉద్దేశ్యంతో మహాయాగ ఫౌండేషన్ ఆధ్వర్యంలో టీడీపీ నేత దొడ్ల కోదండరామిరెడ్డి, మాజీ ఎంపీపీ దొడ్ల విజయలక్ష్మి దంపతులు ప్రతి నెలా 9వ తేదీన పౌష్టికాహారం అందజేస్తుండడం అభినందనీయమని బుచ్చి ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి డాక్టర్ పద్మజ అన్నారు. శనివారం బుచ్చి ప్రభుత్వాసుపత్రిలో గర్భిణులు, బాలింతలకు కోదండరామిరెడ్డి దంపతులు ప్రత్యేక భోజనం, గుడ్లు, ఐరన్ మాత్రలు, మల్టీవిటమిన్ సిరప్, పండ్లు అందజేశారు ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ముగిసిన ఆలయ వార్షికోత్సవ వేడుకలు

ఉదయగిరి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కృష్ణంపల్లిలో గురువారం నుంచి ప్రారంభమైన సీతారామ లక్ష్మణ హనుమత్ సమేత రామ చంద్రస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు శనివారం ముగిశాయి. స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి వసంతోత్సవం, ఉట్టి మహోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పెద్దూరుకు చెందిన నానం రమేష్ (45) అప్పుల బాధ తట్టుకోలేక శనివారం రాత్రి కనిగిరి రిజర్వాయర్ వద్ద ఓ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ సంతోష్‌రెడ్డి వివరాలు మేరకు... బుచ్చిరెడ్డిపాళెం పెద్దూరుకు చెందిన నానం రమేష్ నెల్లూరు రూరల్ మండలం పొట్టేపాళెంలో కూల్‌డ్రింక్ దుకాణం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే అప్పులు ఎక్కువై రుణదాతల ఒత్తిళ్లు తట్టుకోలేక ఉరివేసుకుని మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

13న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి పర్యటన

ఉదయగిరి రూరల్, ఆగస్టు 9 (ఆంధ్ర జ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఈనెల 13న చేపట్టనున్న నెల్లూరు పర్యటనను విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షురాలు పీ విజయ లక్ష్మి అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుని హోదాలో తొలిసారి జిల్లా పర్యటనకు వస్తున్నారని, క్రియాశీలక సభ్యులు, బూత్ కమిటీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం ప్రసాద్, మన్నేటి శ్రీనివాసులురెడ్డి, నారాయణరెడ్డి, మూల మాధవరెడ్డి, శ్రీహరి, సూర్యనారాయణరెడ్డి, శశిరేఖ తదితరులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య



గణేష్ (ఫైల్)

రాపూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కళాశాలకు వెళ్తున్నానని చెప్పి ఓ ఇంటర్ విద్యార్థి తెలుగు గంగ కాలువలో శవమై తేలాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... రాపూరు మండలం వెలుగోను గ్రామానికి చెందిన అందెన మధుసూదన్‌రెడ్డి, సంపూర్ణమ్మ దంపతుల రెండవ కుమారుడు గణేష్ (17) నెల్లూరులో ఒక కళాశాలలో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. తండ్రి మధుసూదన్‌రెడ్డి గురువారం ఉదయం గణేష్‌ను కాలేజికి వెళ్లడానికి రాపూరు ఆర్టీసీ డిపో వద్ద వదిలిపెట్టాడు. కాలేజీ ఫీజు కట్టేందుకు కొంత డబ్బు కూడా ఇచ్చి పంపాడు. కాగా, ఫీజు విషయమై గురువారం సాయంత్రం కళాశాల అధ్యాపకుడికి ఫోన్‌చేసి అడగగా, కళాశాలలో లేను.. శుక్రవారం ఉదయం వెళ్లి కనుక్కుంటాను అని చెప్పారు. ఉదయం కళాశాలకు వెళ్లిన అధ్యాపకుడు అసలు గణేష్ కళాశాలకే రాలేదని అతని తల్లిదండ్రులకు తెలియజేశాడు. దీంతో ఫోన్ కూడా లేని గణేష్ ఎక్కడికెళ్లాడోనని బంధుమిత్రులు, స్నేహితులదరినీ తండ్రి మధుసూదన్‌రెడ్డి అడిగాడు. శుక్రవారం సాయంత్రం జోరేపల్లి తెలుగుగంగ కాలువలో ఒకవ్యక్తి మృతదేహం వెళ్తున్నట్లు గమనించిన స్థానికులు చరవాణిలో వాట్సాప్ గ్రూప్‌లో పెట్టారు. దీంతో బంధువులు చూసి రాపూరు పోలీస్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు తెలుగుగంగ కాలువలో వెతుకగా రాత్రి 10 గంటల సమయంలో సిద్ధవరం గ్రామ సమీపాన దొరికిన మృతదేహాన్ని గజ ఈతగాళ్ల సహాయంతో బయటికి తీసి చూడగా గణేష్‌దేనని గుర్తుపట్టారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాపూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చదువులో రాణించలేక పోతున్నాననే ఉద్దేశ్యంతోనే బలవన్మరణానికి పాల్పడినట్లు అనుమానిస్తున్నారు.

రెండు బైకులను ఢీకొన్న కారు

● యువకుడి మృతి.. నలుగురికి గాయాలు



మృతి చెందిన దేవళ్ల ప్రశాంత్

ఉలవపాడు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : ఒకేసారి ఓ కారు రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొన్న ప్రమాదంలో యువకుడు మృతి చెందగా, మరో నలుగురు గాయపడ్డ సంఘటన శనివారం సాయంత్రం రాజుపాలెం అడ్డరోడ్డు వద్ద జరిగింది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. భీమవరం గ్రామం వడ్డెరపాలెంకు చెందిన దేవళ్ల ప్రశాంత్ (25) దేవళ్ల కళ్యాణ్, తమ్మిశెట్టి సాయి (8) ముగ్గురూ ఉలవపాడుకు వచ్చి రాఖీలు కొనుక్కుని తిరిగి భీమవరం గ్రామానికి బయలుదేరారు. రాజుపాలెం అడ్డరోడ్డు దాటే క్రమంలో ఒంగోలు వైపు వస్తున్న కారు ద్విచక్రవాహన్ని ఢీకొని కొంతదూరం ఈడ్చుకెళ్లింది. ఈ క్రమంలోనే రాజుపాలెం గ్రామం నుంచి హైవే పైకి వస్తున్న మరో ద్విచక్ర వాహనాన్ని కూడా కారు ఢీకొంది. భీమవరం గ్రామానికి చెందిన ముగ్గురికి తీవ్ర గాయాలవడంతో వారిని 108లో ఉలవపాడు సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతు ప్రశాంత్ మృతి చెందాడు. బాలుడు సాయికి కాలు విరిగింది. కళ్యాణ్ తలకు గాయం కావడంతో ఇరువురిని మెరుగైన వైద్యం కోసం ఒంగోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మరో ద్విచక్ర వాహనంపై వెళుతున్న రాజుపాలెంకు చెందిన ఉమ్మడిపోలు మురళి, యన్నా బత్తిన గిరిలకు స్వల్ప గాయాలయ్యాయి. మృతుడు ప్రశాంత్ అవివాహితుడు. ఈప్రమాదంతో భీమవరం బీసీ కాలనీలో విషాద ఛాయలు అలముకున్నాయి. కేసు నమోదుచేసి దర్యాప్తు చేసున్నట్లు ఎస్ఐ అంకమ్మ తెలిపారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన శనివారం సాయంత్రం వెంకటాచలం-వేదాయపాలెం రైల్వేస్టేషన్‌ల మధ్య జరిగింది. వివరాల మేరకు వెంకటాచలం-వేదాయపాలెం రైల్వే స్టేషన్‌ల మధ్య వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకింద గుర్తుతెలియని వ్యక్తి (55) పడ్డాడు. ఆవ్యక్తి ట్రైన్‌కు చిక్కుకుపోవడంతో నెల్లూరు వరకు ఈడ్చుకు రావడంతో తీవ్రగాయాలై మృతిచెందాడు. మృతుడు పచ్చ రంగు గీతల హాఫ్ హ్యాండ్స్ టీ షర్ట్, నలుపు రంగు గళ్ల లుంగీ ధరించి ఉన్నాడు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్ఐ హరిచందన సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు



క్షతగాత్రులను 108లో ఆత్మకూరు తరలిస్తున్న పోలీసులు

మర్రిపాడు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు - ముంబయి జాతీయ రహదారిపై మర్రిపాడు అటవీ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. మర్రిపాడు మండలం ఇస్కపల్లి గ్రామానికి చెందిన నలుగురు కుటుంబ సభ్యులు బైక్‌పై బద్వేలు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా బద్వేల్ వైపు వెళ్తున్న కారు ఎదురుగా ఢీకొంది. దీంతో బైక్‌పై ఉన్న ఓ చిన్నారితో సహా ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను పోలీసులు 108 సహాయంతో ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కోడిపందేల స్థావరంపై పోలీసుల దాడి

నెల్లూరురూరల్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): నెల్లూరురూరల్‌లోని దొరతోపు కాలనీ వద్ద శనివారం నిర్వహిస్తున్న కోడి పందెం స్థావరంపై పోలీసులు దాడి చేసి 8 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రెండు కోడిపుంజులు, 15 బైకులు, రూ.23 వేలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ గుంజి వేణు తెలిపారు.

పైలాన్ కూల్చివేతలో వైసీపీ నేతలే కీలకం

● గ్రామస్థులు తీసిన వీడియోల ఆధారంగా నిందితుల గుర్తింపు

కావలి రూరల్ ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): తుమ్మలపెంట సెంటర్‌లోని జలజీవన్ మిషన్ పైలాన్, శిలాఫలకం కూల్చివేతలో వైసీపీ నేతలే కీలకంగా మారారు. ఈనెల 6వతేదీ అర్ధరాత్రి విద్యుత్ సరఫరా నిలిపివేసి పైలాన్, శిలాఫలకాన్ని కూల్చివేస్తున్న సమయంలో గ్రామస్థులు తమ మొబైళ్లలో తీసిన వీడియోలు కీలకంగా మారాయి. అన్నగారిపాలెం పంచాయతీ కార్యదర్శి పెనుగొండయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన రూరల్ పోలీసులు గ్రామస్థులు తీసిన వీడియోల ఆధారంగా ఎక్స్‌వేటర్, ట్రాక్టర్ యజమానితోపాటు కూల్చివేతలో పాల్గొన్న కొందరు వైసీపీ నేతలను ముద్దాయిలుగా గుర్తించినట్లు విశ్వసనీయ సమాచారం.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	107
స్కిన్ చికెన్	200
స్కిన్‌లెస్	220

కోడిగుడ్ల ధర (100): 500

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ వ్రతం



నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): నగరంలోని మహాత్మాగాంధీనగర్ కృష్ణమందిరంలో శనివారం శ్రావణ పౌర్ణమి సందర్భంగా ఉదయం అభిషేకాలు, గోత్ర నామపూజలు జరిగాయి. అనంతరం సామూహిక సత్యనారాయణ వ్రతం ఆలయం అర్చకులు బి.శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో భక్తులు భక్తిశ్రద్ధలతో చేశారు. ఈ కార్యక్రమాలను ఆలయ పాలక మండలి సభ్యులు పర్యవేక్షించారు.

రూ.12 కోట్లతో ఎఫ్ఎఫ్‌సీ

- ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ నిర్మాణ పనులు ప్రారంభం
- 26 షాపులతో ఇండస్ట్రియల్ కాంప్లెక్స్
- 6 నెలల్లో పూర్తి కానున్న జీ ప్లస్-2 భవనం
- రెండో విడతలో మరిన్ని భవనాల నిర్మాణం



ఎఫ్ఎఫ్‌సీ (ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్) మ్యాప్



భగత్‌సింగ్ కాలనీ వద్ద ప్రారంభమైన నిర్మాణ పనులు

నెల్లూరు(వెంకటేశ్వరపురం), ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగర నియోజకవర్గం వెంకటేశ్వరపురం పరిధిలోని భగత్‌సింగ్‌కాలనీ ప్రాంతంలో రూ.12 కోట్లతో ఎఫ్ఎఫ్‌సీ (ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్) నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నియోజకవర్గానికి ఒక ఎంఎస్ఎంఈ పార్కును ఏర్పాటు చేయాలని ఇప్పటికే నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా నగర నియోజకవర్గానికి ఎంఎస్ఎంఈ పార్కుకు అవసరమైన మేరకు స్థలం లేకపోవడం వలన భగంత్‌సింగ్ కాలనీ ప్రాంతంలో ఎఫ్ఎఫ్‌సీకి రెండు ఎకరాల భూమిని కేటాయించారు. ఇందులో నిర్మాణ పనులు చేపట్టేందుకు రూ.12 కోట్లు నిధులు మంజూరు చేశారు.

● ప్రారంభమైన నిర్మాణ పనులు

ఏపీఐఐసీ ఆధ్వర్యంలో జీ ప్లస్-2 భవన నిర్మాణ పనులను టెండర్ల ద్వారా ఓ ప్రైవేటు సంస్థకు అప్పగించారు. వీరు నిర్మాణ పనులను ప్రారంభించారు. మొత్తం 26 షాపులతో పాటు, క్యాంటిన్, పరిపాలన భవనం, ప్రతి షాపునకు ప్రత్యేక మరుగుదొడ్డి, పార్కింగ్ ఇలా అన్ని సదుపాయాలతో కూడిన భవనాన్ని దాదాపు అర ఎకరాలో నిర్మాణం ప్రారంభించారు. ఆరు నెలల్లో నిర్మాణ పనులు పూర్తి చేసి ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకొన్నారు. రెండు ఎకరాల్లో మిగిలిన స్థలంలో రెండో విడతలో మరికొన్ని షాపుల నిర్మాణం చేసి ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు లీజులకు ఇవ్వడం లేదా, విక్రయించడానికి అధికారులు చర్యలు చేపడుతారు.

చిన్న పరిశ్రమలకు ప్రయోజనం



నెల్లూరు నగర నియోజకవర్గంలో నిర్మాణ చేపడుతున్న ఎఫ్ఎఫ్‌సీ చిన్న పరిశ్రమలకు ఎంతగానో ప్రయోజనకరంగా ఉంటుంది. చిన్న పరిశ్రమలు నెలకొల్పేందుకు నగరంలోని ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ఇది మంచి అవకాశం. మొదటి విడతలో 26 షాపులు అందుబాటులో ఉన్నాయి. ఇప్పటికే నిర్మాణాలు ప్రారంభించారు. ఆరు నెలల్లో పూర్తి చేసి అప్పగించాల్సి ఉంది.

- ఎల్.శివకుమార్, జెడ్ఎం, ఏపీఐఐసీ

గిరిజనుల ఉన్నతికి విద్యే మూలం

● ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో నగర మేయర్ స్రవంతి



ఆదివాసీ దినోత్సవంలో పాల్గొన్న మేయర్ స్రవంతి

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి) : గిరిజనుల ఉన్నతికి విద్యే మూలమని నగర మేయర్ పోట్లూరి స్రవంతి అన్నారు. శనివారం నగరంలోని గిరిజన భవన్‌లో ఐటీడీఏ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న స్రవంతి మాట్లాడుతూ విద్యతోనే ఉన్నత శిఖరాలను అధిరోహించగలమని చెప్పారు. గిరిజనులు చదువుకోడానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయన్నారు. బాగా చదువుకుని మంచి ఉద్యోగాలు సాధించాలన్నారు. ఒక గిరిజన కుటుంబం నుంచి ఒక విద్యార్థి చదువుకుంటే, ఆ కుటుంబ జీవనశైలి మారుతుందన్నారు. ఐటీడీఏ పీవో బీ.మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ గిరిజనులు బాగా చదవుకుని ఉన్నత స్థానాల్లో స్థిరపడాలన్నారు. ఐటీడీఏ ద్వారా గిరిజనులకు అన్ని పథకాలు అందేలా చేస్తామన్నారు. విద్య ప్రాముఖ్యతను వారికి తెలియచేసి వారు బాగా చదువుకునేలా చేస్తామన్నారు. అనేక శిక్షణ కార్యక్రమాలు, అనేక పథకాలు అమలులో ఉన్నాయన్నారు. వాటిన్నంటిపై గిరిజనులకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమలో గిరిజన సంక్షేమశాఖాధికారి పరిమళ, తదితరులు పాల్గొన్నారు.

జేవీవీ ఆధ్వర్యంలో హిరోషిమా, నాగసాకీ డే



శాంతి కపోతాలు ఎగురవేస్తున్న జేవీవీ నాయకులు

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : జన విజ్ఞాన వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం స్థానిక మద్రాసు బస్టాండ్ వద్దా హిరోషిమా నాగసాకీడే కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు కే.శ్రీనివాసులు పాల్గొని మాట్లాడుతూ అమెరికా, జపాన్‌లోని హిరోషిమా నాగసాకీలపై ఆగస్టు 6వ తేదీ, 9వ తేదీల్లో అణుబాంబు దాడులు జరిగాయన్నారు. ఇది జరిగి 80 ఏళ్లైనా ఆ నగరాలలో నేటికీ పర్యావరణం కాలుష్యంగానే ఉందన్నారు. రెండవ ప్రపంచ యుద్ధంలో అనేక దేశాలు సర్వం కోల్పోయాయని తెలిపారు. యుద్ధం వద్దు శాంతిని కోరుకుందామని పిలుపునిచ్చారు. పర్యావరణాన్ని భూమిని కాపాడుకొని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పీ.బాలకోటేశ్వరరావు మాట్లాడుతూ అణ్వస్త్రాలు వద్దు అన్నం, వస్త్రాలు కావాలన్నారు. యుద్ధాల వలన వచ్చే నష్టాలు, కష్టాలను వివరించారు. అనంతరం శాంతి కపోతాలను ఎగురవేసి పర్యావరణ పరిరక్షణ నినాదాలను చేసి, మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూజే హజరత్తయ్య, డాక్టర్ వీ.వేణుగోపాల్, ఎం.శివపార్వతి, వి.చక్రపాణి, దశరధరామయ్య, చైతన్య, ప్రసాద్, శేషు, తదితర జేవీవీ నాయకులు పాల్గొన్నారు.

రెప్కో బ్యాంకుకు రూ.140 కోట్ల నికరలాభం

● చీఫ్ మేనేజర్ రవికిషోర్



కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాకు డివిడెండ్ చెక్కు అందచేస్తున్న సంతానం

నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారత ప్రభుత్వ సంస్థ రెప్కో బ్యాంకు రూ.140కోట్ల నికర లాభాన్ని ఆర్జించిందని ఆ బ్యాంకు చీఫ్ మేనేజర్ జే. రవికిషోర్ చెప్పారు. శనివారం నెల్లూరులోని రెప్కో బ్యాంకులో ఆయన విలేకరులతో మాట్లాడారు తమ బ్యాంకు చరిత్రలోనే ఈ నికరలాభం అత్యధికమని పేర్కొన్నారు. రెప్కో బ్యాంకు ఛైర్మన్ బి.సంతానం 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తమ బ్యాంకు షేర్ క్యాపిటల్‌పై రూ.22.90 కోట్ల డివిడెండ్ చెక్కును కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాకు ఈ నెల 4వ తేదీన ఢిల్లీలో అందచేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో రెప్కో బ్యాంకు డైరెక్టర్ సి. తంగరాజు, హోంఫైనాన్స్ లిమిటెడ్ ఛైర్మన్ ఓఎం గోకుల్, డైరెక్టర్లు ఆర్.ప్రసన్న, హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ సహాయకార్యదర్శి మక్షాన్ లాల్ మీనా తదితరులు పాల్గొన్నారని చెప్పారు. ఈ సమావేశంలో రెప్కో బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ పాలకీర్తి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): చిన్నారుల ఆరోగ్యమే దేశ ప్రగతికి దోహదమని అబైండింగ్ హోప్ ట్రస్ట్ ఛైర్మన్ డాక్టర్ నిర్మలకుమార్ తెలిపారు. శనివారం కొండాయపాలెం ట్రస్ట్ కార్యాలయంలో చిన్నారులకు పోషకాహార ప్యాకెట్లు పంపిణీ చేశారు. పిల్లల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ప్రతినెల 3వేల మంది చిన్నారులతో పాటు క్యాన్సర్, టీబీ బాధితులు 1500 మందికి పోషకాహార ప్యాకెట్లు అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏ.జయప్రకాష్, సిస్టర్ మ్యాగీ, క్రాంతికుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

నెల్లూరు(విద్య), ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీహర్ష కోచింగ్ సెంటర్‌లో శనివారం విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. డైరెక్టర్ హరిబాబు మాట్లాడుతూ తమ వద్ద శిక్షణ పొందిన విద్యార్థులు ఇటీవల విడుదలైన పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు, బ్యాంకు ఉద్యోగాలకు 31 మంది ఎంపికయ్యారన్నారు. మిగిలిన విద్యార్థులు కూడా వీరిని స్ఫూర్తిగా తీసుకుని కష్టపడి శిక్షణ పొందితే విజయాలు సాధించవచ్చన్నారు. అనంతరం విద్యార్థులను ఘనంగా సత్కరించారు. అధ్యాపకులు ఆచార్య ఇంటూరి శ్రీనివాస్, ఆర్‌టీ.నాయుడు, నరేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

జీవో 174ను రద్దు చేయాలి

● ఏపీ పీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్



మాట్లాడుతున్న ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): విజయవాడ నడిబొడ్డున ఉన్న గవర్నర్‌పేట-1, 2 డిపోలకు సంబంధించిన రూ.400 కోట్ల విలువ చేసే ఆర్టీసీ స్థలాలను 99 ఏళ్లకు తక్కువ లీజుకు ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో 174ను వెనక్కు తీసుకోవాలని ఏపీ పీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ కార్యదర్శి జీ.నారాయణరావు డిమాండ్ చేశారు. నగరంలోని ఆర్టీసీ ప్రధాన బస్టాండులోని ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో శనివారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. విలువైన స్థలాలను ప్రజల అవసరాలకు ఉపయోగపడే విధంగా రూపకల్పన చేయాలన్నారు. అలా కాని పక్షంలో రాష్ట్ర కమిటీ తీసుకునే నిర్ణయాల్లో భాగంగా రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు అందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి ఓవీ ప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల అమల్లో భాగంగా ఆగస్టు 15వ తేది నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని అమలు చేయనున్నందున ఈ పథకం జిల్లాలో సజావుగా అమలు అయ్యేందుకు కావాల్సిన అన్ని చర్యలు జిల్లా అధికారులు తీసుకోవాలన్నారు. రద్దీకి అనుగుణంగా బస్సులు నడపాలని, తిరుపతి-నెల్లూరు నాన్‌స్టాప్ పాయింట్‌లో గ్రౌండ్ బుకింగ్, ఆర్టీసీ ప్రధాన బస్టాండులోని రిజర్వేషన్ కౌంటర్లను ప్రైవేటు పరం చేసే చర్యలు మానుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ సెక్రటరీ మాల్యాద్రి, ప్రచార కార్యదర్శి వీఎస్ రావు, జిల్లా ఉపాధ్యక్షుడు ఏ.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ దివ్యాంగుల కేంద్రంలో రక్షాబంధన్



చెట్టుకు రాఖీ కట్టి హారతి ఇస్తున్న విద్యార్థినులు



ఎస్పీకి పోస్టర్స్‌ను అందిస్తున్న బ్రహ్మకుమారీలు

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి) : ఇండియన్ రెడ్‌క్రాస్ దివ్యాంగుల కేంద్రంలో శనివారం రక్షాబంధన్ ఘనంగా జరిగింది. రెడ్‌క్రాస్ పాలక మండలి సభ్యులు దాసరి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రక్షాబంధన్ అంటే కేవలం అక్కకు తమ్ముడు కట్టే రాఖీ మాత్రమే కాదని, జీవితంలో ఏ సందర్భంలోనైనా సోదరికి అండగా ఉంటానన్న ధైర్యాన్నిస్తూ ప్రతిజ్ఞ చేసేదే రక్షాబంధన్ అని చెప్పారు. మన సంస్కృతిలో మానవ సంబంధాలు పెంపొందించేందుకు ఈ సంస్కృతిని అందించారన్నారు. ఈ కార్యక్రమంలో నాగేంద్ర, ఏడుకొండలు, అఖిల్ దివ్యాంగుల కేంద్రం ఉపాధ్యాయులు, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.



దివ్యాంగురాలికి రాఖీ కడుతున్న ఓ చిన్నారి

వృక్షాబంధన్..

నెల్లూరు(విద్య,ఆంధ్రజ్యోతి) : నగరంలోని నారాయణ సీబీఎస్ఈ రెసిడెన్షియల్ బాలుర పాఠశాల, సీవో పాఠశాలల్లో శనివారం విద్యార్థులు మొక్కలకు రాఖీలు కట్టి వినూత్నంగా వృక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా అటవీశాఖ అధికారి మహబూబ్‌బాషా మాట్లాడుతూ మొక్కలను నాటడంతో పాటు వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. విద్యార్థి దశ నుంచి బాలబాలికలు పర్యావరణంపై అవగాహన పెంచుకుంటే భావితరాలు ఎంతో ఆరోగ్యకరమైన జీవనాన్ని సాగిస్తారన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన పెంచేందుకు, మొక్కల ప్రాధాన్యతను తెలియచేసేందుకు చెట్లకు రాఖీలు కట్టించి వృక్షాబంధన్ నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. ఇదే స్ఫూర్తితో అన్ని పాఠశాలల్లో కూడా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తే పర్యావరణ పరిక్షణకు ఎంతో దోహదం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం రవివర్మ, ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీకి రాఖీ కట్టిన బ్రహ్మకుమారీలు

నెల్లూరు(క్రైం,ఆంధ్రజ్యోతి): బ్రహ్మకుమారి ఈశ్వర విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో బ్రహ్మకుమారీలు శనివారం ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఎస్పీ జీ.కృష్ణకాంత్‌కు రాఖీ కట్టారు. అనంతరం బ్రహ్మకుమారీ పోస్టర్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి బ్రహ్మకుమారి ప్రసన్న, స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

ఇక హాస్టళ్లకూ మార్కులు!

(5వ పేజీ తరువాయి)

హాస్టళ్ల పనితీరును బట్టి ర్యాంకులు ఇవ్వాలని నిర్ణయించింది. ఈ విద్యా సంవత్సరం నుంచే ఈ విధానాన్ని అమలు చేసి వచ్చే ఏడాది ర్యాంకులు ప్రకటించనుంది. ఇందుకోసం ప్రత్యేకంగా ఆరు నిర్దేశిత అంశాలను విడుదల చేసింది.

● మొత్తం వంద మార్కులు..

ఆరు నిర్దేశిత అంశాలకు ప్రభుత్వం వంద మార్కులు కేటాయించింది. విద్యా-చదువులో పనితీరుకు 40 మార్కులు (హాస్టల్‌లో ఉన్న విద్యార్థుల ప్రగతికి 20, అద్భుత ఫలితాల సాధనకు మరో 20 మార్కులు) ఉంటాయి. అదేవిధంగా విద్యార్థుల హాజరు, రిటెన్షన్‌కు ఐదు వంతున 10 మార్కులు కేటాయించారు. మెనూ ప్రదర్శనకు రెండు, అమలుకు 10 మార్కులు కేటాయించారు. హాస్టల్‌లో అనుకోని ఘటనలు జరిగి, విద్యార్థులు ఇబ్బందిపడితే వాటికి స్పందించటం, ఉన్నతాధికారులకు తక్షణమే సమాచారం ఇవ్వడానికి మరో ఐదు మార్కులు కేటాయించారు. పరిశుభ్రత, పచ్చదనం, పారిశుధ్య నిర్వహణ, మౌలిక సదుపాయాలు కల్పనకు మరో ఐదు మార్కులు ఉంటాయి. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాల నిర్వహణకు 4, ఆరోగ్య పరీక్షల నిర్వహణకు 4, పీ-4 కార్యక్రమంలో భాగంగా స్ఫూర్తిదాయకమైన కార్యక్రమాల నిర్వహణ, వనరుల సమీకరణకు మరో 4 మార్కులు కేటాయించారు. క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం, విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దినందుకు 6, సాంకేతికత మెరుగుదల, ఆవిష్కరణకు 4 మార్కులు కేటాయించారు. హాస్టళ్లపై పత్రికల్లో వచ్చే కథనాలకు సంబంధించి అధికారుల వివరణకు 3 మార్కులను కేటాయించారు.

● వలంటీర్ల నియామకం

ప్రీమెట్రిక్ హాస్టళ్లలో ఉండే విద్యార్థులకు రాయడం, చదవటం, లెక్కలు వంటివి నేర్పించడానికి వలంటీర్లను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో ప్రీమెట్రిక్ హాస్టల్‌కు ఒక్కో వలంటీర్‌ను నియమించనున్నారు. వీరికి గౌరవవేతనం చెల్లించనున్నారు.

హాస్టళ్లలో మెరుగైన ఫలితాలు సాధిస్తాం

హాస్టళ్లలో పనితీరు మెరుగు, విద్యాప్రమాణాలు, వసతుల మెరుగుకు ప్రభుత్వం ర్యాంకులను ప్రవేశపెట్టింది. ఈ విద్యా సంవత్సరం నుంచే ఈ విధానం అమలులోకి వస్తుంది. దీనిద్వారా జిల్లాలోని బీసీ సంక్షేమ హాస్టళ్లలో మరింత మెరుగైన ఫలితాలను సాధిస్తాం.

- వెంకటలక్ష్మమ్మ, జిల్లా బీసీ సంక్షేమాధికారి

గరుడుడిపై వేదగిరీశుడి గిరిప్రదక్షిణ



శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని వేదగిరి క్షేత్రంలో లక్ష్మీనృసింహుడికి శనివారం గరుడ వాహనంపై గిరిప్రదక్షిణ నిర్వహించారు. ముందుగా విశేష అభిషేకాలు నిర్వహించిన అనంతరం స్వామివార్లను ముస్తాబు చేసి గరుడ వాహనంపై కొలువుదీర్చి ఆలయ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం వేదపండితుల మంత్రోశ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ గిరిప్రదక్షణ వేడుకగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో గోపి, ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు, అర్చకులు పాల్గొన్నారు.

- నెల్లూరురూరల్(ఆంధ్రజ్యోతి)

భక్తిశ్రద్ధలతో శ్రావణ పౌర్ణమి పూజలు

● ఆలయాల్లో కిటకిటలాడిన భక్తులు



స్నపన తిరుమంజనం పూజలందుకుంటున్న రాజరాజేశ్వరి

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): శ్రావణ పౌర్ణమి సందర్భంగా ఆలయాల్లో శనివారం విశేష పూజలు జరిగాయి. భక్తులు భారీ సంఖ్యలో ఆలయాలకు చేరుకోవడంతో కళకళలాడాయి. నగరంలోని రాజరాజేశ్వరి ఆలయంలో ఉత్సవమూర్తికి విశేష అభిషేకాలు జరిగాయి. వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో అమ్మవారికి స్నపన తిరుమంజనం కన్నుల పండువగా జరిగింది. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను ఆలయ సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి, అర్చకులు, సిబ్బంది పర్యవేక్షించారు.

● కమనీయం శ్రీవారి కల్యాణం

బాలాజీనగర్ సీతారామమందిరంలో శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి కల్యాణం కనుల పండువగా జరిగింది. మకరత విఘ్నేశ్వరస్వామికి, శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి, సీతారాముల స్వాములకు అభిషేకాలు, విశేష పూజలు జరిగాయి. సాయంత్రం విశేష పూలంగిసేవ జరిగింది. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ పాలక మండలి సభ్యులు పర్యవేక్షించారు.

● వైభవంగా ఛండీయాగం

కోదండరామపురం మహాలక్ష్మి ఆలయంలో 17వ వార్షికోత్సవం, మహాకుంభాభి షేకం, ఉత్సవాలు శనివారం రెండో రోజుకి చేరాయి. ఈ వేడుకల్లో భాగంగా కలిశస్థాపన, మండపారాధనలు, అగ్ని ప్రతిష్ఠ, గణపతి హోమం, అభిషేకాలు జరిగాయి. అనంతరం చండీహోమం జరిగింది. సాయంత్రం విశేష హోమాలు, అనంతరం మహాలక్ష్మీ హోమాలు జరిగాయి.

● నేడు మహాకుంభాభిషేకం

మహాలక్ష్మీ ఆలయంలో ఆదివారం వార్షికోత్సవం, మహాకుంభాభిషేకాలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 11గంటలకు మహాకుంభాభిషేకం, 12గంటలకు అన్నదానం, సాయంత్రం 6గంటలకు శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి కల్యాణం జరుగుతుందని తెలిపారు. భక్తులు తరలిరావాలని కోరారు.

కమనీయం శివపార్వతుల కల్యాణం



శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మూలాపేట మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ పౌర్ణమి సందర్భంగా శనివారం రాత్రి శివపార్వతుల కల్యాణం కమనీయంగా జరిగింది. ఉదయం మూలస్థానేశ్వర స్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు జరిగాయి. భువనేశ్వరి అమ్మవారికి నవావరణ పూజలు, పూలంగిసేవలు జరిగాయి. ఈ కార్యక్రమాలను ఆలయ ఈవో అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి, ఉభయ కర్తలు, అర్చకులు సిబ్బంది పర్యవేక్షించారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

గురుకులంలో ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఉదయగిరి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): నెల్లూరు రూరల్ మండలం అక్కచెరువుపాడు మైనారిటీ గురుకుల బాలుర పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 5, 6, 7, 8వ తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్ష నిమిత్తం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జీ.మురళీకృష్ణ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాలలో 1 నుంచి 8వ తరగతి వరకు కులాల వారీగా ఎస్సీ-8, ఎస్టీ-5, పీహెచ్‌సీ-5, అర్ఫన్స్-7 మొత్తం 25 ఖాళీలు ఉన్నాయన్నారు. ఆసక్తిగల విద్యార్థులు తగు ధ్రువపత్రాలతో ఈనెల 14వ తేదీలోపు పాఠశాల పనివేళల్లో అందించి వివరాలు నమోదు చేయించుకోవాలని పేర్కొన్నారు. ఈనెల 16న ప్రవేశ పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతుందని, ప్రతిభ ఆధారంగా సీటు కేటాయిస్తామని పేర్కొన్నారు. అలాగే మైనారిటీ విద్యార్థులకు 5 నుంచి 8వ తరగతి వరకు ఎలాంటి ప్రవేశ పరీక్ష లేకుండా నేరుగా తీసుకుంటామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 8712625045, 9000846065 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.



సీతారామపురంలో రాఖీ కట్టుకుంటున్న చిన్నారులు

ఉత్సాహంగా రాఖీ పండుగ

నెల్లూరు (సాంస్కృతికం) : ఆత్మీయ అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పండుగను జిల్లావాసులు ఉత్సాహంగా జరుపుకున్నారు. వయసుతో నిమిత్తం లేకుండా సోదరులకు సోదరీమణులు రాఖీలు కట్టారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు కూడా కొంతమంది మహిళలు రాఖీలు కట్టారు. నగరంలోని మార్వాడీలు చిన్నబజార్, మండపాల వీధి, పెద్దబజార్, ఆచారివీధి, కాపు వీధుల్లో వారి వేడుకలు జరుపుకున్నారు.

414 భవనాలపై
థర్డ్‌పార్టీ విచారణ

నెల్లూరు(సిటీ): నెల్లూరు నగరంలోని పలు డివిజన్లలో సుమారు 414 భవనాల ఆస్తి పన్నుపై థర్డ్‌పార్టీ విచారణ జరుగుతోంది. ఏప్రిల్ 1వ తేదీతో మొదలైన నూతన ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ భవనాలకు ఆస్తి పన్ను తగ్గింది. ఆ మేరకు డిమాండ్‌ను కార్పొరేషన్ విడుదల చేసింది. దీనిపై విచారణ చేపట్టాలని రాష్ట్ర పురపాలక శాఖ ఆదేశించడంతో వాస్తవాలను గుర్తించే క్రమంలో థర్డ్‌పార్టీ విచారణ చేపట్టారు. ప్రస్తుతం ఒంగోలు కార్పొరేషన్‌కు సంబంధించిన రెవెన్యూ అధికారులు ఈ భవనాల పన్ను తగ్గింపుపై సమగ్ర విచారణ చేపట్టినట్లు సమాచారం. వారిచ్చే తుది నివేదిక ఆధారంగా తదుపరి పన్ను జారీ ఉంటుందని రెవెన్యూ వర్గాలు వెల్లడించాయి.



కల్యాణోత్సవంలో పాల్గొన్న వేమిరెడ్డి, మేకపాటి దంపతులు

శ్రీనివాసా గోవిందా..
శ్రీ వేంకటేశా గోవిందా!

● ఉదయగిరిలో వేడుకగా శ్రీవారి కల్యాణం

ఉదయగిరి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : ఉదయగిరి రంగనాయకులస్వామి ఆలయ ప్రాంగణంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడి కల్యాణం కనులపండువగా సాగింది. స్థానిక వైఎస్ఆర్ సర్కిల్ నుంచి ఉత్సవ విగ్రహాలను మేళతాళాలు, బాణసంచా పేలుళ్ల, భక్తుల కోలాట నృత్యప్రదర్శనలు, గోవింద నామస్మరణ చేస్తూ మెయిన్‌బజార్ మీదుగా రంగనాయకులస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన కల్యాణవేదిక వద్దకు చేర్చారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ స్వామివారి కల్యాణం జరిగింది. భారీగా తరలివచ్చిన భక్తులు గోవింద నామస్మరణతో రెండు చేతులు జోడించి స్వామివారికి నమస్కరిస్తూ పరవశించిపోయారు. గ్రామాల్లో భక్తులు గోటితో వలిచిన వడ్ల బియ్యాన్ని స్వామివార్లకు తలంబ్రాలుగా సమర్పించారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, శాంతికుమారి దంపతులు పాల్గొని స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. ఆర్టీసీ నెల్లూరు రీజియన్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెంచలబాబుయాదవ్, టీడీపీ, బీజేపీ, విశ్వహిందూ పరిషత్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం ఉట్టి మహోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. స్వామివార్లను ప్రత్యేక వాహనంలో కొలువుదీర్చి పట్టణ పురవీధుల్లో గ్రామోత్సవం చేపట్టారు. భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఉదయగిరి సీఐ వెంకటరావు ఆధ్వర్యంలో ఎస్ఐలు కర్నాటి ఇంద్రసేనారెడ్డి, శ్రీను, ఆదిలక్ష్మిలు గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



స్వామివారి ఊరేగింపులో భక్తుల కోలాహలం

SUNDAY SPECIAL


పెన్నమ్మ హొయలు..
ప్రకృతి పిలుపులు..

● సోమశిల జలాశయం సొంతం

చుట్టూ కొండలు.. పచ్చిన చెట్లు.. వాటిమధ్యలో పక్షుల కిలకిలరావాలు ఓ పక్క. పెన్నమ్మను తాకుతూ వీచే చల్లగాలులు మరోవైపు.. సోమశిల జలాశయం సొంతం. పర్యాటకులనే కాదు.. భక్తులను ఆకట్టుకునే డ్యాం పరిసర ప్రాంతం సెలవు రోజులు, ఇతర పర్వదినాలలో రద్దీగా మారుతుంటుంది. రెండు కొండల మధ్య నిర్మించిన ఈ డ్యాంను చూసేందుకు మన జిల్లా నుంచేగాక పొరుగు జిల్లాల నుంచి కూడా వస్తుంటారు.

- అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి)

ఐదవ పంచవర్ష ప్రణాళికలో భాగంగా సోమశిల డ్యాం ప్రతిపాదనలు జరిగాయి. నెలూరుతోపాటు చెన్నై ప్రజల దాహార్తి తీర్చేలా 1975లో పెన్నానదిపై సోమశిల గ్రామం వద్ద ప్రాజెక్టు నిర్మాణానికి అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు శిలాఫలకం వేశారు. సుమారు పదేళ్ల పాటు ఏకదాటిగా పనులు జరిగాయి. 1985లో నీటి నిల్వ ప్రక్రియ మొదలవగా అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తున్నట్లు ప్రకటించి జిల్లా ప్రజలకు నీరు ఇచ్చారు.



వరద పోటెత్తి నిండుకుండగా మారిన సోమశిల డ్యాం నుంచి గేట్లను ఎత్తి గంగమ్మను దిగువకు వదిలే సమయంలో సుందర వీక్షణం (ఫైల్)

ఇవి చేస్తే..

ప్రకృతిప్రియులను కట్టిపడేసే సోమశిల జలాశయం వద్ద మరిన్ని సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. డ్యాం వద్ద నిరుపయోగంగా ఉన్న డార్మెంటరీని వినియోగంలోకి తేవాలి. అతిథి గృహాలను అందుబాటులోకి తెస్తే బాగుంటుంది. ఖాళీ ప్రదేశాల్లో పార్కులు, రెస్టారెంట్లు, అటవీ అందాలు వీక్షించేలా బోటుషికారు వసతులు కల్పిస్తే ప్రభుత్వానికి ఆదాయం కూడా సమకూరుతుంది.



● 5.6 లక్షల ఎకరాల్లో సాగు

సోమశిల ప్రాజెక్టు నిర్మించక ముందు జిల్లా ఎడారిని తలిపించేది. మాగాణి భూమి అయినా ఏడాదికి ఒకకారు మాత్రమే పండేది. సోమశిల జలాశయ నిర్మించాక కండలేరు జలాశయం కూడా అనుసంధానం కాగా కాలువలు అభివృద్ధి చెందాయి. సుమారు 68 టీఎంసీల సామర్థ్యం కలిగిన డ్యాంలో నీటిని నిల్వ చేసి సాగు, తాగునీటికి సరఫరా చేస్తున్నారు. ఇంకేముంది... మాగాణితోపాటు మెట్టభూములూ పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. అంతేకాదండోయ్... భూమి విలువ పదింతలు పెరిగింది. ప్రస్తుతం జలాశయం పరిధిలో మొదటి పంట కింద 5.60 లక్షలు, రెండవ పంట మరో మూడు లక్షల ఎకరాలు వరి సాగులోకి వస్తుంది. దీంతో సింహపురి కాస్త ధాన్యపుగిరిగా మారింది.

ఇక్కడి చేపలు భలే రుచి!



అరుదైన మత్స్యసంపద సోమశిల డ్యాంకే దక్కుతుంది. ఎర్రగండి, నల్లగండి, శ్రీలావతి, కట్ల, బొచ్చ, రూప్‌చంద్, చందువ, మూస, కొర్రమీను, పంజారం, రొయ్యలు, పీతలు డ్యాంలో లభిస్తాయి. లైసెన్సు కలిగిన జాలర్లు 800 కుటుంబాలకు కూడా ఈ డ్యాం జీవనాధారం. పెన్నాకు ఉపనదులైన కుందూ, పాపాగ్ని, సగిలేరు తదితర పాయల నుంచి నీరు ఈ నదిలో కలుస్తుంటాయి. అందుకేనేమో డ్యాంలో దొరికే చేపలకు మంచి రుచి ఉంటుంది. జిల్లా అవసరాలు తీర్చడంతోపాటు కోల్‌కతా, పూణె, ముంబయి మహానగరాలకూ ఇక్కడి చేపలు ఎగుమతి అవుతాయి. స్థానికంగా కేజీ రూ.110 నుంచి 150 వరకు విక్రయిస్తారు. సోమశిలను సందర్శించే పర్యాటకులు ఇక్కడదొరికే చేపలు కొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు.

పచ్చదనంతో పెనుశిల కొండలు

జలాశయం చుట్టూ దట్టమైన సుమారు వెయ్యి హెక్టార్ల విస్తీర్ణంలో పెనుశిల కొండలు పచ్చదనం సంతరించుకొన్నాయి. ఈ కొండల్లో చిరుతలు, జింకలు, అడవికుక్కలు, కోళ్ల, పందులు, దుప్పలు, అడవిదున్నలు, ఆవులు, ఎలుగుబంట్లు, ముళ్లపందులు ఉన్నాయి. ఇక ఎర్రచందనం, మామిడి, ఉసిరి తదితర వృక్షాలు ఉన్నాయి. అటవీ సంపద రక్షించేలా చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. అడవిలో వెళ్లేందుకు ఎవరికీ అనుమతి లేదు.

20 మెగావాట్స్ విద్యుత్ ఉత్పత్తి



జలాశయం నీటిని వినియోగించుకొంటూ విద్యుత్ ఉత్పతి చేసేలా బాలాజి పవర్ ప్లాంట్ ఉంది. ఇందులో నాలుగు యూనిట్లు ఉండగా, 20 మెగావాట్స్ విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. నీటితో కరెంటు ఉత్పత్తి విధానం చూడముచ్చటగా ఉంటుంది. అయితే, ఇక్కడకు ఎవరికీ అనుమతి లేదు. నీటితో విద్యుత్ తయారీ అనంతరం ఇదే నీరు డెల్టా, నాన్‌డెల్టాకు తరలిస్తారు.

సోమేశ్వరాలయం విశిష్టత

డ్యాం దిగువన సోమేశ్వరుడి ఆలయం ఉంది. విక్రమాదిత్యుడి కాలంలో ఈ ఆలయం నిర్మించినట్లు పెద్దలు చెబుతారు. జలాశయం నిర్మాణ సమయంలోనే ఆలయానికి ఎలాంటి ముప్పు జరగకుండా జాగ్రత్తలు తీసుకుని డ్యాం కట్టడాలు నిర్మించారు. అయితే 2021, 22 ఏడాదిలో వచ్చిన భారీ వరదకు ఆలయ గాలిగోపురం ధ్వంసమైంది. గత వైసీపీ పాలకులు ఆలయ అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా వెచ్చించలేదు. టీడీపీ అధికారంలోకి వచ్చాక ఆలయ పునఃనిర్మాణ పనులు జరుగుతున్నాయి. రూ.8 కోట్లతో ఆలయాన్ని నిర్మిస్తుండగా గ్రానైట్ పనులు జరుగుతున్నాయి. పవిత్ర పెన్నానదిలో స్నానం చేసి సోమేశ్వరుడిని దర్శించుకొంటే కోరికలు తీరుతాయని భక్తుల విశ్వాసం. శ్రావణ మాసంలో పూజలు, శివరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతాయి.



నిర్మాణదశలో సోమేశ్వరుడి ఆలయం

మా ఊరును కాపాడు స్వామీ!

శ్రీవారికి జంగంరెడ్డివాసులు వేడుకోలు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): జంగం రెడ్డిపల్లి గ్రామ సమీపంలోని కొండ ప్రాంతంలో మైనింగ్ (తెల్ల రాయి) తవ్వకాల అనుమతులను రద్దు చేయాలని కోరుతూ చేపడుతున్న ఆందోళనలో భాగం గా శనివారం ఆందోళనకారులు శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యే క పూజలు నిర్వ హించారు. వరికుంటపాడు, జంగంరెడ్డిపల్లి, భాస్కరాపురం గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకొని మూకుమ్మడిగా పూజల్లో పాల్గొన్నారు. మైనింగ్ మహమ్మారి నుంచి తమతోపాటు తమ గ్రామాలను కాపాడు స్వామి అంటూ వేడుకున్నారు.

ప్రైవేట్ ఆసుపత్రులకు రిజిస్ట్రేషన్ లేకుంటే చర్యలు

● డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఏర్పాటు చేసిన ప్రతి ప్రైవేట్ ఆసుపత్రికి వైద్య ఆరోగ్యశాఖ అనుమతితో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకుం టామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత హెచ్చరించారు. శనివారం ఆమె నెల్లూరు నగరంలోని అపోలో, నారాయణ, ఎనెల్ ఆసుపత్రులను ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయా ఆసుప త్రుల్లో పలు రికార్డులు పరిశీలిం చారు. ఆసుపత్రుల నిర్వాహణ నిబంధనలకు అనుగుణంగా ఉందా లేదా అని పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈనెల 6 నుంచి 13వ తేదీ వరకు తనిఖీలు చేస్తున్నామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అల్లోపతి క్లినికల్ కేర్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ 2002 ప్రకారం తప్పనిసరిగా ఆసుపత్రులు వైద్యశాఖ అనుమతులు తీసుకోవాలన్నారు. ప్రతి ఐదేళ్లకు ఒకసారి ఒకనెల రోజుల ముందుగానే ఆన్‌లైన్‌లో రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. అలా చేసుకోని ఆసుపత్రులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ప్రైవేట్ ఆసుపత్రికి పొల్యూషన్, ఫైర్, బయో మెడికల్ వేస్ట్ అనుమతి పత్రాలు ఉండాలన్నారు. ఆసుపత్రుల్లో అందించే వైద్య సేవల ధరల పట్టిక అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ఈ తనిఖీల్లో డాక్టర్ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



శ్రీవారికి అభిషేకించిన తులసీదళాలు

పెంచలోరికి లక్ష తులసీ దళార్చన

శ్రావణ పౌర్ణమి సందర్భంగా శనివారం పెంచలకోన క్షేత్రంలో లక్ష్మీనృసింహుడికి లక్ష తులసీ దళార్చన, కుంకుమార్చన జరిగింది. ఉదయం మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు, పూజలు, అనంతరం ప్రత్యేక అర్చనలు, హోమాలు జరిగాయి. శ్రీవారి నందనవనంలో ఉత్సవమూర్తులను కొలువుదీర్చి తులసీ దళాలతో అత్యంత వైభవంగా పూజించారు. సాయంత్రం స్వామివారు బంగారు గరుడుడిపై కొలువుదీరి మాఢవీధుల్లో విహరించారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ దంపతులు ఉభయదాతలుగా పాల్గొన్నారు. వచ్చిన భక్తులకు అన్నప్రసాదాలు అందించినట్లు ఈవో పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

- రాపూరు, (ఆంధ్రజ్యోతి)



పాల్గొన్న వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల దంపతులు

ఏపీఆర్ఎస్ఏ కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షుడిగా నాగేశ్వరరావు

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 9 (ఆంధ్ర జ్యోతి): ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర కార్యవర్గం ఆదేశాల మేరకు జిల్లాలోని కలెక్టరేట్, కందుకూరు డివిజన్ యూనిట్లకు నగరంలోని ఏపీఆర్ఎస్ఏ భవన్‌లో శనివారం ఎన్నికలు నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నికున్నారు. ఈ ఎన్ని కల్లో కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షుడుగా యద్ద నాగేశ్వరరావు, కందుకూరు డివిజన్ యూనిట్ అధ్యక్షుడుగా విజయ భాస్కర్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికలైన కార్యవర్గ సభ్యులకు ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి, కార్యదర్శి డానియల్ పీటర్‌రావు, తదితరులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.



ఏపీఆర్ఎస్ఏ కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షుడిగా ఎన్నికైన నాగేశ్వరరావుకు ధ్రువీకరణ పత్రం అందచేస్తున్న ఎన్నికల అధికారి అనిల్‌కుమార్ యాదవ్

మళ్లీ తెరపైకి...!

● ఇనాం భూముల సమస్య ● రీసర్వే జరగని గ్రామాల్లో రిజిస్ట్రేషన్‌కు నో చాన్స్


● ప్రభుత్వాలు మారుతున్నా తొలగని ఇబ్బందులపై ప్రజాగ్రహం

అల్లూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఇనాం భూములపై సమస్యలు నేటికీ రైతులను వెంటాడుతూనే ఉన్నాయి. రీసర్వే జరిగిన గ్రామాల్లోని ఇనాం భూములు రికార్డుల్లో పట్టా భూములుగా మారాయి. రీసర్వే జరగని గ్రామాల్లోని ఇనాం భూముల పరిస్థితి మాత్రం అగమ్యగోచరంగా ఉంది. పదేళ్ల కిందట ఇనాం భూములు రిజిస్ట్రేషన్ కాకపోవడంతో పలువురు అనేక సమస్యలు ఎదుర్కొన్నారు. అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇనాం భూముల్లో ఓ కేటగిరీకి చెందిన భూములను మాత్రమే రిజిస్ట్రేషన్‌కు అంగీకరించారు. అయితే ఇటీవల చేపట్టిన రీసర్వే ద్వారా వెబ్‌ల్యాండ్ రికార్డుల్లో ఇనాం అనే పదాన్ని తొలగించి పట్టా అని నమోదు చేశారు. దీంతో ఇనాం భూముల సమస్య తీరినట్టేనని రైతులు భావించారు. కానీ కొన్ని గ్రామాలు, పట్టణాల్లో రీసర్వేను నిలిపేయడంతో ఇనాం భూముల సమస్య అలానే ఉంది.

అవసరమైన రైతులు తమ భూములను విక్రయించుకునేందుకు కార్యాలయాలకు వెళ్లిన సమయంలో రిజిస్ట్రేషన్ అధికారులు ఇనాం భూములు రిజిస్ట్రేషన్ చేయటానికి మోకాలడ్డేవారు. కానీ రిజిస్ట్రేషన్‌లో ఒక సాఫ్ట్‌వేర్ ద్వారా ఆన్‌లైన్‌లో పీడీఈ (పబ్లిక్ డేటా ఎంట్రీ) అనే ఒక వెబ్ సైట్ లో అందించే సమాచారంలో ఇనాం భూముల సర్వేనెంబర్లు ప్రతిబింబించకుండా రిజిస్ట్రేషన్ శాఖ చర్యలు చేపట్టింది. దీంతో అసలు సంబంధిత సబ్ రిజిస్ట్రార్లను కూడా అడిగే పరిస్థితి లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు. జిల్లావ్యాప్తంగా దాదాపు 45వేల ఎకరాలకుపైగా ఈ తరహా భూములు ఉండడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

● కోర్టుల్లో కేసులు

ఇనాం భూములను పట్టా భూములుగా పరిగణించాలంటూ పలువురు కోర్టుల్లో వేలాది కేసులు వేశారు. వీటిపై వాదనలు కూడా జరిగినా, ఇనాం భూములను రికార్డుల్లో ఉన్న కాలమ్‌లోని ఇనాం పదాన్ని తొలగించేందుకు సాహసం చేసేవారు ఎవరూ లేక ఆ సమస్య నేటికీ వెంటాడుతూనే ఉంది. రీసర్వేతో ఇనాం భూములు పూర్తి పట్టా భూమిగా మార్చు పొందే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు.



Adangal Report

District: SPSR Nellore | Mandal: BOGOLE | Village: JUVVALADINNE | Survey No.: 1019-B

The information contained made available through this web site is for information only and cannot be utilised as certified / authenticated copy for producing in any court or for enforcing any legal claims etc under the existing relevant Acts / Rules framed by the Government of Andhra Pradesh in this context.

వెబ్‌ల్యాండ్‌లో భూమి స్వభావం ఇనాం... అని ఉన్న అడంగల్ కాపీ



రైతులకు ఇబ్బందిగా రిజిస్ట్రేషన్ శాఖ చర్యలు

రిజిస్ట్రేషన్ చేయించుకునేం దుకు అసలు పీడీఈలో సర్వేనెంబర్లు ప్రతిబింబించక పోవడం దారుణం. అన్నీ ఇనాంలు ఒకటికావనే విషయం ఉన్నతాధికారులకు తెలియనిది కాదు. అలాంటిది అన్ని పీడీఈలో ఇలా ప్రతిబింబించనీయకపోవడం సరైన పద్ధతి కాదు. దీంతో రైతులకు తీవ్ర ఇబ్బందే.

- పప్పు సుధాకర్, రైతు, అల్లూరు



అధికారులు రైతులను ఆదుకోవాలి

ఇనాం భూములు రిజిస్ట్రేషన్ చేయకపోవడం పెద్ద సమస్యగా మారింది. గతంలో జమీన్‌దారులు, జాగీరు దారులు తమ ఇష్టానుసారంగా గ్రామాలను ఇనాం గ్రామాలుగా ప్రకటించారు. వెట్టిచాకిరీ చేసేవారిని ఇనాం గ్రామాల్లో పెట్టి పెత్తనం చలాయించేవారు. బ్రిటీషు కాలం నాటి ఇనాం భూముల సమస్య నేటికీ రైతులను వెంటా డటం దారుణం. దీనిపై రాష్ట్ర ఉన్నతస్థాయి అధికారులు ఓ పరిష్కారాన్ని కనుగొని రైతులను ఆదుకోవాలి.

- పోలిశెట్టి శ్రీనివాసులు, రైతు, ఉలవపాళ్ల, దగదర్తి మండలం

కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ



ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు అంగడి మహబూబ్ బాషా. ఆయన తల్లి పేరిట బోగోలు మండలం జువ్వలదిన్నెలోని సర్వేనెంబరు 1018, 1019 నంబర్లలో 5.21 ఎకరాల భూమి ఉంది. అతను తన అవసరాల నిమిత్తం కొంత భూమిని అమ్మాడు. కొనుగోలు చేసిన వ్యక్తి రిజిస్ట్రేషన్ కోసం కావలి సబ్‌రిజిస్ట్రారు కార్యాలయానికి వెళ్లాడు. ఇది ఇనాం భూమి కావడంతో రిజిస్ట్రేషన్‌కు వీలుకాదని అధికారులు తేల్చిచెప్పారు. దీంతో బాషాకు కొనుగోలుదారుడికి మధ్య సమస్య తలెత్తింది. దీంతో అతను కార్యాలయాల చుట్టూ తిరుతున్నాడు.

డీసీ పల్లిలో పొగాకు ధరలు

మర్రిపాడు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): డీసీపల్లి పొగాకు వేలం కేంద్రానికి శనివారం రైతులు 309 బేళ్లను తీసుకొని రాగా 20 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని, 173 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 136 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ఠ ధర రూ. 280 కాగా, కనిష్ఠ ధర రూ. 150 పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి రాజశేఖర్ తెలిపారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 9728
వెండి కిలో ధర	రూ. 118600
వెండి ఒక గ్రాము	రూ. 121.60

న్యూస్ బాక్స్

ఉత్సాహంగా రక్షాబంధన్



రాఖీ కట్టిన అక్కాచెల్లెళ్లకు కానుకలు అందజేస్తున్న వెంకటేశ్వర్లు

ఉదయగిరి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీ.చెర్లోపల్లి గ్రామంలో శనివారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కొట్టే వెంకటేశ్వర్లకు అక్కాచెల్లెళ్లు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియచేశారు. అనంతరం ఆయన వారికి కానుకలుగా మిఠాయిలు, చీరలు అందజేశారు. అలాగే ఉదయగిరి పట్టణంతోపాటు మండలంలోని అన్ని గ్రామాల్లో రక్షాబంధన్ వేడుకలను వైభవంగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కర్రా కృష్ణ, వరలక్ష్మీ, రవీంద్ర, రాము, కమతం శ్రీనివాసులు, రసూల్, కిరణ్, రమేష్ పాల్గొన్నారు.

● ఉదయగిరి రూరల్ : ఉదయగిరి, వరికుంటపాడు మండలాల్లో శనివారం రాఖీ పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల్లో నివాసాలు ఉన్న ఆడపడుచులు గ్రామాలకు చేరుకొని తమ సోదరులకు రాఖీలు కట్టి ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా అన్నదమ్ములు సైతం తమ అభిమానాన్ని చాటుకుంటూ సోదరీమణులకు కానుకలు అందజేశారు.

● సీతారామపురం : మండలంలో రాఖీ పౌర్ణమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించుకున్నారు. అన్నలు చెల్లెళ్లకు, అక్కలు తమ్ముళ్లకు రాఖీలు కట్టారు. ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

13న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పర్యటన



సమావేశంలో పాల్గొన్న బీజేపీ నేతలు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఈనెల 13న చేపట్టనున్న నెల్లూరు పర్యటనను విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షురాలు పీ విజయలక్ష్మి అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుని హోదాలో తొలిసారి జిల్లా పర్యటనకు వస్తున్నారని, క్రియాశీలక సభ్యులు, బూత్ కమిటీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం ప్రసాద్, మన్నేటి శ్రీనివాసులురెడ్డి, నారాయణరెడ్డి, మూల మాధవరెడ్డి, శ్రీహరి, సూర్యనారాయణరెడ్డి, శశిరేఖ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీనివాసుడి కల్యాణం

● తిలకించి పరవశించిన భక్తజనం



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక వైకుంఠపురంలో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రావణ మాసం సందర్భంగా శ్రీనివాస కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు పెండ్యాల సూర్యనారాయణ, అమ్మాజీ దంపతుల ఆధ్వర్యంలో తొలుత నూతన విగ్రహాలకు హోమాలు, ప్రాణప్రతిష్ఠ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి వేదపండితుల మంత్రోచ్ఛరణ నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించి విశిష్టతను భక్తులకు వివరించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని కల్యాణం తిలకించిన భక్తజనులు ఆనంద పరవశంతో పులకించిపోయారు. గోవింద నామస్మరణతో ఆలయం మారుమోగింది. నెల్లూరు, ప్రకాశం జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కాగా కాకొల్లువారిపల్లి గ్రామానికి చెందిన కాకొల్లు గణేశ్వరరావు, నాగమణి దంపతులు, కుటుంబీకులు వెండి కిరీటాలు అందజేయడంతో పాటు అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ పౌర్ణమి పూజలు



రాజరాజేశ్వరిదేవికి పూజలు చేస్తున్న భక్తులు

సంగం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరుమనకొండలో ఉన్న రాజరాజేశ్వరిదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో శ్రావణమాస పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం ఆలయ పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌లకు క్షీర, పంచామృత, సకల ద్రవ్యాలతో అభిషేకించిన అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. హోమం, పూజలు నిర్వహించారు. పూర్ణాహుతి సమర్పించారు. తదనంతరం ఆలయ పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి భక్తులకు ప్రాణాయామం, శ్రీరామ క్రియా ధ్యానంపై వివరించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ



ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న భక్తులు

సంగం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరమన గ్రామంలో నూతనంగా నిర్మించిన అన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో శనివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మంగళ వాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ ధ్వజస్తంభం, కాశీ విశ్వేశ్వరస్వామి, అన్నపూర్ణదేవి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఆలయ శిఖరంపై కలశ ప్రతిష్ఠ, కుంభాభిషేకం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఘటికసిద్ధేశ్వరాలయంలో ఎంపీ వేమిరెడ్డి పూజలు



ప్రత్యేకపూజల్లో పాల్గొన్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి

సీతారామపురం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ప్రాచీన శైవ క్షేత్రం ఘటిక సిద్ధేశ్వరంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారులు ఎంపీని పూర్ణకుంభంతో ఆలయంలోకి స్వాగతించారు. పరమశివుడు, ఇష్టకామేశ్వరి దేవి, కాశినాయన ఆలయాల్లో పాలాభిషేకం, కుంకు మార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల టీడీపీ నాయకులు ఎంపీ వేమిరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ చెంచలబాబు యాదవ్, మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్‌రాజు, మండల క్లస్టర్ ఇన్‌చార్జి వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, చెన్నకేశవులు, జాషువా, మాజీ జెడ్పీ టీసీ జ్యోతి, పిడుగు రమేష్, వీకాష్ బాబు, ముత్తుకూరు వెంకటసుబ్బయ్య, చంద్రరెడ్డి, ఇజ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఆలయ వార్షికోత్సవ వేడుకలు

ఉదయగిరి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణంపల్లి గ్రామంలో గురువారం నుంచి ప్రారంభమైన సీతారామ లక్ష్మణ హనుమత్ సమేత రామచంద్రస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా అర్చకులు స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి వసంతోత్సవం, ఉట్టి మహోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం స్వామివార్లను అశ్వ వాహనంపై కొలువుదీర్చి గ్రామ సమీపంలోని వనంలోకి గ్రామోత్సవంగా పారువేటకు తరలించి ఉత్సవాలకు ముగింపు పలికారు. ఈ వేడుకలకు భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

విద్యాలయాల్లో మౌలిక వసతుల కల్పనకు

రూ. 1.06 కోట్ల మంజూరు : మంత్రి ఆనం

ఆత్మకూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని పలు విద్యాలయాల్లో మౌలిక వసతుల కోసం సమగ్ర శిక్ష నిధులను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మంజూరు చేశారని రాష్ట్ర దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శనివారం ఓప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 8 పాఠశాలలకు రూ. 1.06 కోట్లు వెచ్చించి ఈ విద్యా సంవత్సరంలో మౌలిక వసతులు కల్పిస్తామని ఆయన తెలిపారు. మర్రిపాడు మండలం నందవరంలోని ఏపీ మోడల్ స్కూల్‌కు రూ. 15లక్షలు, పల్లిపాడు ప్రాథమిక పాఠశాలకు రూ.13.05 లక్షలు, మర్రిపాడు ఎంపిపిడబ్ల్యు (హెచ్‌డబ్ల్యు) పాఠశాలకు రూ. 11.05 లక్షలు, అనంతసాగరం ఎంపీపీఎస్ (ఎస్సీ) పాఠశాలకు రూ. 8.05 లక్షలు, అనుమసముద్రంపేట మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్‌కు రూ.15 లక్షలు, ఏఎస్‌పేట (హిందూ) ఎంపీపీఎస్ పాఠశాలకు రూ.5.9 లక్షలు, చేజర్ల మెయిన్ ఎంపీపీఎస్ పాఠశాలకు రూ. 3.00 లక్షలు, ఆత్మకూరు ఎంపీపీఎస్(వెస్ట్) పాఠశాలకు రూ. 35.20 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి



ప్రైవేట్ వైద్యశాలలో మందులషాపును పరిశీలిస్తున్న డాక్టర్ అస్మా

ఆత్మకూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆత్మకూరు అర్బన్ వైద్యశాల వైద్యాధికారిణి డాక్టర్ షేక్ అస్మా తెలిపారు. జిల్లా మెడికల్, హెల్త్ అధికారి ఆదేశాల మేరకు ఆమె శనివారం ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలోని పలు ప్రైవేట్ వైద్యశాలలు, ల్యాబ్‌లను తనిఖీ చేశారు. ప్రైవేట్ వైద్యశాలల రిజిస్ట్రేషన్, ఫైర్, పొల్యూషన్ సర్టిఫికెట్స్ పరిశీలించారు. ఆసుపత్రులలోని మందుల షాపులను తనిఖీ చేసి ఎమర్జెన్సీ, అన్ని వ్యాధులకు సంబంధించిన మందులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. రోగులకు తాగునీరు తదితర వసతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో సిద్దం సుధాకర్, టీబీ ఎల్‌టీ ఏ సుధాకర్, ఎంపీహెచ్‌ఏ జి రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సీపీఎం ఆందోళన



బిజ్జంపల్లిలో ఆందోళన చేస్తున్న ప్రజలు

ఉదయగిరి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిజ్జంపల్లి గ్రామంలో శనివారం స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో ప్రజలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా సీపీఎం నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ ఎన్నికల ముందు మంత్రి నారా లోకేష్ బాబు స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తే పగలకొట్టాలని పిలుపునిచ్చారని గుర్తు చేశారు. ప్రతి ఇంటికి బలవంతంగా బిగించాలని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. మీటర్ల ఏర్పాటు వల్ల రూ.500 వచ్చే విద్యుత్ బిల్లు రూ.5 వేలు వస్తుందన్నారు. వెంటనే ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఏర్పాటును విరమించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

బాలికల గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

ఆత్మకూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతిలో మిగిలిన సీట్లలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ పికెకె రౌత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 14వతేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. విద్యార్థి ఆధార్, స్టడీ సర్టిఫికెట్, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాలతో ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలలో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. దరఖాస్తుచేసుకున్న వారికి ఈనెల 16వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ప్రవేశపరీక్ష నిర్వహించి ప్రతిభ ఆధారంగా సీటు ఇవ్వడం జరుగుందని తెలిపారు. 8712625046, 9398646852 నెంబర్లకు ఫోన్‌చేసి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చన్నారు.

అక్కచెరువుపాడు గురుకులంలో

● ఉదయగిరి : నెల్లూరు రూరల్ మండలం అక్కచెరువుపాడు మైనారిటీ గురుకుల బాలుర పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 5, 6, 7, 8వ తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్ష నిమిత్తం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జీ మురళీకృష్ణ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాలలో 1 నుంచి 8వ తరగతి వరకు కులాల వారీగా ఎస్సీ-8, ఎస్టీ-5, పీహెచ్‌సీ-5, అర్ఫన్స్-7 మొత్తం 25 ఖాళీలు ఉన్నాయన్నారు. ఆసక్తిగల విద్యార్థులు తగు ధ్రువపత్రాలతో ఈనెల 14వ తేదీలోపు పాఠశాల పనివేళల్లో అందించి వివరాలు నమోదు చేయించుకోవాలన్నారు. ఈనెల 16న ప్రవేశ పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతుందన్నారు. ప్రతిభ ఆధారంగా సీటు ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే మైనారిటీ విద్యార్థులను 5 నుంచి 8వ తరగతి వరకు ఎలాంటి ప్రవేశ పరీక్ష లేకుండా నేరుగా తీసుకుంటామన్నారు. మరిన్ని వివరాలకు 8712625045, 9000846065 అనే నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

తెలుగు రైతు మండల అధ్యక్షుడిగా చల్లా ఎంపిక



చల్లా చంద్రశేఖర్‌రెడ్డి

అనంతసాగరం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మండల తెలుగు రైతు అధ్యక్షుడిగా టీడీపీ సీనియర్ నాయకుడు, కొత్తపల్లి మాజీ సర్పంచ్ చల్లా చంద్రశేఖర్‌రెడ్డి ఎంపికయ్యారు. ఈసందర్భంగా ఆయన దేవదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి, డీసీసీబీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. రైతుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారి సంక్షేమం కోసం పనిచేస్తానని చెప్పారు.

గుక్కెడు నీటి కోసం గిరిజనుల అవస్థలు

● పట్టించుకోని అధికారులు



రోడ్డు అవతలకు వెళ్లి నీళ్లు పట్టుకుంటున్న మహిళలు

సంగం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారెడ్డిపాళెంలోని శివాలయానికి ఎగువన ఉన్న పులగం రాజేశ్వరమ్మ ఎస్టీ కాలనీలో తాగునీటి సమస్య నెలకొనడంతో గుక్కెడు నీటి కోసం గిరిజనులు అవస్థలు పడుతున్నారు. గ్రామంలో ఇళ్లు లేని గిరిజనులకు 2004లో శివాలయం ఎగువ ప్రాంతంలో ఇంటిస్థలాలు మంజూరు చేసింది. ఆ తరువాత పక్కాగృహాలు మంజూరవడంతో ఇంటి నిర్మాణాలు చేపట్టారు. అప్పట్లో తాగునీటి కోసం చేతి పంపులు ఏర్పాటు చేశారు. అయితే గ్రామంలో తాగునీరు లభ్యం కాకపోవడంతో ఎస్టీ కాలనీకి ఎగువన బోరు పాయింట్‌లు వేసి ఆర్‌అండ్‌బి రహదారికి ఉత్తరం వైపు పైపులైన్లు వేసి గ్రామంలోకి తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఈక్రమంలో ఎస్టీ కాలనీలోకి పైపు లైన్లు వేయకుండా కాలనీవాసుల నీటి అవసరాల కోసం రోడ్డుకు ఉత్తరం వైపే కుళాయిలు ఏర్పాటు చేశారు. దీంతో కాలనీ వాసు లు నీటి కోసం రోడ్డు దాటి కుళాయిల వద్ద నీటిని తెచ్చుకోవాలసిన పరిస్థితి ఏర్ప డింది. నీటిని తీసుకుని రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలకు గురి కావలసి వస్తోందని, అధికారులు స్పందించి కాలనీలో పైపులైన్లు ఏర్పాటుచేసి ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేయాలని గిరిజనులు కోరుతున్నారు.

C.R.I.M.E N.E.W.S

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య



గణేష్ (ఫైల్)

రాపూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కళాశాలకు వెళ్తున్నానని చెప్పి ఓ ఇంటర్ విద్యార్థి తెలుగు గంగ కాలువలో శవమై తేలాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... రాపూరు మండలం వెలుగోను గ్రామానికి చెందిన అందెన మధుసూదన్‌రెడ్డి, సంపూర్ణమ్మ దంపతుల రెండవ కుమారుడు గణేష్ (17) నెల్లూరులో ఒక కళాశాలలో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. తండ్రి మధుసూదన్‌రెడ్డి గురువారం ఉదయం గణేష్‌ను కాలేజికి వెళ్లడానికి రాపూరు ఆర్టీసీ డిపో వద్ద వదిలిపెట్టాడు. కాలేజీ ఫీజు కట్టేందుకు కొంత డబ్బు కూడా ఇచ్చి పంపాడు. కాగా, ఫీజు విషయమై గురువారం సాయంత్రం కళాశాల అధ్యాపకుడికి ఫోన్‌చేసి అడగగా, కళాశాలలో లేను.. శుక్రవారం ఉదయం వెళ్లి కనుక్కుంటాను అని చెప్పారు. ఉదయం కళాశాలకు వెళ్లిన అధ్యాపకుడు అసలు గణేష్ కళాశాలకే రాలేదని అతని తల్లిదండ్రులకు తెలియజేశాడు. దీంతో ఫోన్ కూడా లేని గణేష్ ఎక్కడికెళ్లాడోనని బంధుమిత్రులు, స్నేహితులదరినీ తండ్రి మధుసూదన్‌రెడ్డి అడిగాడు. శుక్రవారం సాయంత్రం జోరేపల్లి తెలుగుగంగ కాలువలో ఒకవ్యక్తి మృతదేహం వెళ్తున్నట్లు గమనించిన స్థానికులు చరవాణిలో వాట్సప్ గ్రూప్‌లో పెట్టారు. దీంతో బంధువులు చూసి రాపూరు పోలీస్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు తెలుగుగంగ కాలువలో వెతుకగా రాత్రి 10 గంటల సమయంలో సిద్ధవరం గ్రామ సమీపాన దొరికిన మృతదేహాన్ని గజ ఈతగాళ్ల సహాయంతో బయటికి తీసి చూడగా గణేష్‌దేనని గుర్తుపట్టారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాపూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చదువులో రాణించలేక పోతున్నాననే ఉద్దేశ్యంతోనే బలవన్మరణానికి పాల్పడినట్లు అనుమానిస్తున్నారు.

రెండు బైకులను ఢీకొన్న కారు

● యువకుడి మృతి.. నలుగురికి గాయాలు



మృతి చెందిన దేవళ్ల ప్రశాంత్

ఉలవపాడు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : ఒకేసారి ఓ కారు రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొన్న ప్రమాదంలో యువకుడు మృతి చెందగా, మరో నలుగురు గాయపడ్డ సంఘటన శనివారం సాయంత్రం రాజుపాలెం అడ్డరోడ్డు వద్ద జరిగింది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. భీమవరం గ్రామం వడ్డెరపాలెంకు చెందిన దేవళ్ల ప్రశాంత్ (25) దేవళ్ల కళ్యాణ్, తమ్మిశెట్టి సాయి (8) ముగ్గురూ ఉలవపాడుకు వచ్చి రాఖీలు కొనుక్కుని తిరిగి భీమవరం గ్రామానికి బయలుదేరారు. రాజుపాలెం అడ్డరోడ్డు దాటే క్రమంలో ఒంగోలు వైపు వస్తున్న కారు ద్విచక్రవాహన్ని ఢీకొని కొంతదూరం ఈడ్చుకెళ్లింది. ఈ క్రమంలోనే రాజుపాలెం గ్రామం నుంచి హైవే పైకి వస్తున్న మరో ద్విచక్ర వాహనాన్ని కూడా కారు ఢీకొంది. భీమవరం గ్రామానికి చెందిన ముగ్గురికి తీవ్ర గాయాలవడంతో వారిని 108లో ఉలవపాడు సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతు ప్రశాంత్ మృతి చెందాడు. బాలుడు సాయికి కాలు విరిగింది. కళ్యాణ్ తలకు గాయం కావడంతో ఇరువురిని మెరుగైన వైద్యం కోసం ఒంగోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మరో ద్విచక్ర వాహనంపై వెళుతున్న రాజుపాలెంకు చెందిన ఉమ్మడిపోలు మురళి, యన్నా బత్తిన గిరిలకు స్వల్ప గాయాలయ్యాయి. మృతుడు ప్రశాంత్ అవివాహితుడు. ఈప్రమాదంతో భీమవరం బీసీ కాలనీలో విషాద ఛాయలు అలముకున్నాయి. కేసు నమోదుచేసి దర్యాప్తు చేసున్నట్లు ఎస్ఐ అంకమ్మ తెలిపారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన శనివారం సాయంత్రం వెంకటాచలం-వేదాయపాలెం రైల్వేస్టేషన్‌ల మధ్య జరిగింది. వివరాల మేరకు వెంకటాచలం-వేదాయపాలెం రైల్వే స్టేషన్‌ల మధ్య వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకింద గుర్తుతెలియని వ్యక్తి (55) పడ్డాడు. ఆవ్యక్తి ట్రైన్‌కు చిక్కుకుపోవడంతో నెల్లూరు వరకు ఈడ్చుకు రావడంతో తీవ్రగాయాలై మృతిచెందాడు. మృతుడు పచ్చ రంగు గీతల హాఫ్ హ్యాండ్స్ టీ షర్ట్, నలుపు రంగు గళ్ల లుంగీ ధరించి ఉన్నాడు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్ఐ హరిచందన సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు



క్షతగాత్రులను 108లో ఆత్మకూరు తరలిస్తున్న పోలీసులు

మర్రిపాడు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు - ముంబయి జాతీయ రహదారిపై మర్రిపాడు అటవీ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. మర్రిపాడు మండలం ఇస్కపల్లి గ్రామానికి చెందిన నలుగురు కుటుంబ సభ్యులు బైక్‌పై బద్వేలు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా బద్వేల్ వైపు వెళ్తున్న కారు ఎదురుగా ఢీకొంది. దీంతో బైక్‌పై ఉన్న ఓ చిన్నారితో సహా ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను పోలీసులు 108 సహాయంతో ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కోడిపందేల స్థావరంపై పోలీసుల దాడి

నెల్లూరురూరల్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): నెల్లూరురూరల్‌లోని దొరతోపు కాలనీ వద్ద శనివారం నిర్వహిస్తున్న కోడి పందెం స్థావరంపై పోలీసులు దాడి చేసి 8 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రెండు కోడిపుంజులు, 15 బైకులు, రూ.23 వేలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ గుంజి వేణు తెలిపారు.

పైలాన్ కూల్చివేతలో వైసీపీ నేతలే కీలకం

● గ్రామస్థులు తీసిన వీడియోల ఆధారంగా నిందితుల గుర్తింపు

కావలి రూరల్ ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): తుమ్మలపెంట సెంటర్‌లోని జలజీవన్ మిషన్ పైలాన్, శిలాఫలకం కూల్చివేతలో వైసీపీ నేతలే కీలకంగా మారారు. ఈనెల 6వతేదీ అర్ధరాత్రి విద్యుత్ సరఫరా నిలిపివేసి పైలాన్, శిలాఫలకాన్ని కూల్చివేస్తున్న సమయంలో గ్రామస్థులు తమ మొబైళ్లలో తీసిన వీడియోలు కీలకంగా మారాయి. అన్నగారిపాలెం పంచాయతీ కార్యదర్శి పెనుగొండయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన రూరల్ పోలీసులు గ్రామస్థులు తీసిన వీడియోల ఆధారంగా ఎక్స్‌వేటర్, ట్రాక్టర్ యజమానితోపాటు కూల్చివేతలో పాల్గొన్న కొందరు వైసీపీ నేతలను ముద్దాయిలుగా గుర్తించినట్లు విశ్వసనీయ సమాచారం.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	107
స్కిన్ చికెన్	200
స్కిన్‌లెస్	220

కోడిగుడ్ల ధర (100): 510

మాలకొండ ఆదాయం రూ. 13,85,947

వలేటివారిపాలెం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) మండలంలోని మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి 13,85,947 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమీషనర్ ఎస్. చంద్రశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అష్టోత్తరం టిక్కెట్ల ద్వారా రూ. 9,350, కుంకుమార్చన ద్వారా రూ. 24,200, వివాహాల ద్వారా రూ. 44 వేలు, తలనీలాల ద్వారా రూ. 55,200, వాహనపూజల ద్వారా రూ. 6,220, ప్రత్యేక దర్శనం ద్వారా రూ. 5,05,200, స్థలపురాణ పుస్తకాల విక్రయం ద్వారా రూ. 960, గదిఅద్దెల ద్వారా రూ. 36,200, కవర్ల ద్వారా రూ. 17 వేలు ప్రసాద విక్రయాల ద్వారా రూ. 3,71,345, అన్నదానం ద్వారా రూ. 2,49,772, విరాళాల రూపంలో రూ. 67,500 ఆదాయం లభించిందని ఆయన తెలిపారు.

111 పొగాకు బేళ్ల కొనుగోలు

కలిగిరి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శనివారం రైతులు మొత్తం 224 పొగాకు బేళ్ల అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 10 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 111 బేళ్ల కొనుగోలు చేశారు. నోబిడ్-104, ఆర్ఆర్-1, సీఆర్-5, జంపింగ్‌లాట్స్-3 కారణాలతో 113 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.150, సగటు ధర రూ.220.54గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

డ్రైనేజీ కాలువలో చెత్తా చెదారం తొలగింపు



అడ్డకాలువను శుభ్రం చేయిస్తున్న బీజేపీ నేత అమరా వెంకట సుబ్బారావు

కావలి, ఆగస్టు9 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం రామమూర్తిపేటలోని సాయిబాబా గుడికి వెళ్లే అటవీశాఖ కార్యాలయ పక్క రోడ్డులో ఉన్న అడ్డకాలువ పిచ్చి చెట్లు, చెత్తా చెదారాలతో నిండిపోయింది. ఈ విషయాన్ని స్థానికులు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదు. దీంతో బీజేపీ నేత అమరా వెంకటసుబ్బారావు తన సొంత నిధులతో అక్కడ ఉన్న పిచ్చి చెట్లను, చెత్తను తొలగించారు.

పుర యాప్‌లో ఫిర్యాదు చేసినా స్పందన కరువు



మాట్లాడుతున్న అడ్వకేట్ రెహమాన్

కావలి, ఆగస్టు9 (ఆంధ్ర జ్యోతి): కావలి పట్టణ 8వ వార్డులోని చింతంవారి వీధిలో మున్సిపల్ నిధులతో నిర్మిస్తున్న డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణంలో జరుగుతున్న అవకతవకలపై పుర యాప్ లో ఫిర్యాదు చేసినా మున్సిపల్ అధికా రులలో స్పందన లేదని అడ్వకేట్ రెహమాన్ తెలిపారు. కావలి జర్నలిస్ట్ క్లబ్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డ్రైనేజీ, రోడ్డునిర్మాణం ఆక్రమణలు తొలగించకుండా చేస్తుండటంతో రోడ్డు కుచించుకు పోతుందన్నారు. ఏదైనా ఎమర్జెన్సీ అయితే అంబులెన్స్ కూడా రాలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. దీనిపై అధికారులు స్పందించక పోతే న్యాయపోరాటం చేయాల్సి వస్తుందన్నారు.

మాలకొండ ఆలయ ధర్మకర్తల మండలి నియామకానికి నోటిఫికేషన్

వలేటివారిపాలెం, ఆగస్టు 9 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని మాలకొండ శ్రీమాల్యాద్రి లక్ష్మీనృసింహస్వామి ఆలయ ధర్మకర్తల మం డలి నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం నోటి ఫికేషన్ విడుదల చేసినట్లు ఆలయ అసి స్టెంట్ కమిషనర్ ఎస్. చంద్రశేఖర్ తెలిపారు. కార్యాలయంలో దరఖాస్తులు ఉచితంగా పొందవచ్చన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ప్రక టన జారీ అయిన 20 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

స్వయం ఉపాధిపై యువత దృష్టి సారించాలి

దగదర్తి(బిట్రగుంట) ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): యువత స్వయం ఉపాధిపై దృష్టి సారించాలని టీడీపీ యువనేత మాలేపాటి భానుచందర్ నాయుడు సూచించారు. దగదర్తి మండలం వెలుపోడు సెంటర్‌లో మోటారు వాటర్ సర్వీస్ సెంటర్‌ను శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత మాలేపాటి సుధాకర్‌నాయుడు, కంచర్ల కృష్ణ, వంట్టిగుంట గోపాల్, వర్తినేనికృష్ణ, బాబావల్లి, సురేష్, మోహన్‌రావు, సుబ్బయ్య, వెంకటేశ్వర్లు, సుమంత్, సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

మాలకొండలో ప్రముఖులు

వలేటివారిపాలెం : మండలం లోని మాలకొండ శ్రీ మాల్యా ద్రి లక్ష్మీనృసింహ స్వామిని శనివారం నెల్లూరు పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షుడు ఇంటూరి రాజేష్ దర్శించు కున్నారు. ఆయనకు ప్రధాన ఉపఅర్చకులు గౌరీశంకర్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శాలువా పూల మాలతో సత్కరించి, ప్రసాదం అందజేశారు. ఆయన వెంట పలువురు టీడీపీ నాయకులు, తదితరులు ఉన్నారు.

పశు వైద్యం.. గాలిలో దీపం!

- మందులు ఉన్నా..పశు వైద్యులు, సిబ్బంది లేరు
- లింగసముద్రంలో పశు వైద్యాధికారి, వెటర్నరీ అసిస్టెంటు పోస్టుల ఖాళీ
- వీఆర్ కోటలో భర్తీకాని మూడు పోస్టులు
- ఇబ్బందిపడుతున్న రైతులు, పశు పోషకులు

లింగసముద్రం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : 'అంగట్లో అన్నీ ఉన్నా, అల్లుడి నోట్లో శని' అన్న చందంగా మారింది.. పశువైద్య కేంద్రాల్లో పరిస్థితి. లింగసముద్రం, వీఆర్ కోట పశు వైద్యశాలల్లో సమృద్ధిగా మందులు ఉన్నప్పటికీ, పశు వైద్యాధికారులు, సిబ్బంది లేరు. దీంతో పశు పోషకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత నెల మొదటి వారంలో జరిగిన బదిలీల్లో వీఆర్ కోట పశు పశు వైద్యాధికారి, వెటర్నరీ అసిస్టెంటు బదిలీ అయ్యారు. అయితే ఇక్కడికి కొత్తగా ఎవరూ రాలేదు. అంతేగాక ఈ వైద్యశాలలో చాలా కాలం నుండి ఆఫీసు సబార్డినేట్ పోస్టు కూడా ఖాళీగా ఉంది. దీంతో ఇక్కడ మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ఈ వైద్యశాల పరిధిలోని వీఆర్ కోట, విశ్వనాథపురం, మాలకొండ రాయునిపాలెం, తూనుగుంట, బ్రాహ్మణపల్లి గ్రామాలకు చెంది పశు పోషకులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామాల్లో సుమారు 1000 నుండి 1500 వరకు పశు సంపద, ఇతర జీవాలు ఉన్నాయి. వీటికి ఏదైనా జబ్బు చేస్తే వారు గోపాలమిత్రల వద్ద గానీ, ప్రైవేటుగా గానీ, మందులు కొని జబ్బులను నయం చేయించు కుంటున్నారు. అలాగే అప్పుడప్పుడు తెరిచే పశు వైద్యశాలలో కూడా మందులు తీసుకుంటున్నట్లు వారు తెలిపారు

లింగసముద్రంలో ఆఫీస్ సబార్డినేటే దిక్కు..

గత నెలలో జరిగిన బదిలీల్లో లింగసముద్రం పశు వైద్యశాలకు ఇన్‌చార్జ్ వైద్యాధికారిగా ఉన్న డాక్టర్ బదిలీపై వెళ్లిపోయారు. ఇక్కడ ఆఫీసు సబార్డినేట్ ఒక్కరే ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారు. ఈ వైద్యశాలలో కూడా చాలా కాలం నుండి వెటర్నరీ అసిస్టెంటు పోస్టు ఖాళీగా ఉంది. దీంతో ఈ వైద్యశాల పరిధిలో ఉన్న యర్రారెడ్డిపాలెం, వెంగళాపురం, లింగసముద్రం, వాకమళ్లవారిపాలెం, జంపాలవారిపాలెం, పెంట్రాల, చీమలపెంట, రాళ్లపాడు గ్రామాల పశు పోషకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామాలలో సుమారు 5 వేల వరకు పశు సంపద ఉంది. వీరు లింగసముద్రం వైద్యశాలకు వచ్చి పశువులకు మందులు తీసుకెళుతుంటారు. కొందరు ప్రైవేటు మందుల షాపుల్లో మందులు తీసుకెళుతుంటారు.అయితే రెగ్యులర్ పశు వైద్యులు, వెటర్నరీ సహాయకులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్టు పలువురు చెప్పారు.



వీఆర్ కోట పశు వైద్యశాల

ఇన్‌చార్జ్ వైద్యాధికారిగా డా. సుబ్రహ్మణ్యం

చినపవని పశు వైద్యాధికారి డా. సుబ్రహ్మణ్యంను ఉన్నతాధికారులు లింగసముద్రం, వీఆర్ కోట పశు వైద్యశాలలకు ఇన్‌చార్జ్ వైద్యాధికారిగా నియమించారు. దీంతో ఆయన వారంలో రెండు రోజులకొకసారి అందుబాటులో ఉండి, పశువులకు మందులు ఇచ్చి వెళుతుంటారు. ఇలా ఆయన విధి నిర్వహణలో త్రిపాత్రాభినయం చేస్తున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి రెగ్యులర్ వైద్యులు, సిబ్బందిని నియమించాలని పశు పోషకులు కోరుతున్నారు.

నేడు పుష్కరిణి పునర్నిర్మాణానికి శంకుస్థాపన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న పండితులు

బిట్రగుంట, ఆగస్టు 9 (ఆంధ్ర జ్యోతి): బోగోలు మండలం కొండ బిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వర స్వామి పుష్కరిణి పునర్నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం ఆదివారం నిర్వహిస్తున్నట్లు వేదపండితులు ఈపూరి సత్యనారాయణచార్యులు శనివారం తెలిపారు. స్థానిక టీడీపీ నాయకులు రావి విజయ్ కుమార్ పర్యవేక్షణలో శంకుస్థాపనకు ఏర్పాట్లు చేశారు. ఈసందర్భంగా టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి చొరవతో స్వామి వారి ఆలయాభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. శంకుస్థాపన కార్యక్రమానికి నిర్మాణ దాత ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఎంఎల్సీ బీద రవిచంద్రయాదవ్ హాజరు కానునట్లు ఆయన తెలిపారు. టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులతో పాటు భక్తులు తరలి వచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

కందుకూరులో భారీవర్షం

కందుకూరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణం, పరిసర ప్రాంతాలలో శనివారం సాయంత్రం భారీవర్షం కురిసింది. గత కొద్దిరోజులుగా తీవ్రమైన ఎండలతో అల్లాడిపోతున్న ప్రజలకు వర్షం ఉపశమనం కలిగించింది. ఈ ఏడాది మే నెలలో భారీవర్షాలు కురిసినప్పటికీ ఆ తర్వాత ఇప్పటివరకు చిరుజల్లులు మినహా చెప్పుకోదగ్గ వర్షం కురవలేదు. దీంతో ఖరీఫ్‌లో పైర్ల సాగుకు వాతావరణం అనుకూలించలేదు. మరోపక్క రాళ్లపాడు ఆయకట్టులో ఉన్న పత్తి, అడపాదడపా వర్షాధారంతో సాగుచేసిన పైర్లు కూడా ఎండలధాటికి ఎండిపోతున్న పరిస్థితి.



ఈ ప్రాంతాలలో వేలాది ఎకరాలలో విస్తరించి ఉన్న జామాయిల్ తోటలు కూడా ఎండిపోతున్న దశలో వాటికి వర్షం ఊపిరిపోసింది. బాగా పదును అయినందున జామాయిల్‌లో అంతర్గత సేద్యాలు, ఎరువులకు అనుకూల పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా రాఖీ పౌర్ణమి

కందుకూరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా జరుపుకునే రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని కందుకూరు ప్రాంతంలో శనివారం ఘనంగా జరుపుకొన్నారు. బాలికలు, మహిళలు తమ సోదరులకు రాఖీలు కట్టి వారి ఆశీర్వాదం తీసుకోగా, సోదరులు వారికి బహుమతులు ఇచ్చారు. ఒకప్పుడు ఈ ప్రాంతంలో రాఖీపండుగకు పెద్దగా ప్రాధాన్యం లేనప్పటికీ ఇటీవల పలు ప్రైవేటు పాఠశాలల్లోను రాఖీపర్వదినాన్ని కోలాహలంగా నిర్వహించారు. మరోవైపు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులకు ఆయా పార్టీల మహిళా కార్యకర్తలు రాఖీలు కట్టి ఆశీస్సులు అందుకున్నారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు పలువురు మహిళలు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. మాజీమంత్రి మహీధరరెడ్డిని కందుకూరు పట్టణంలోని పలువురు ముస్లిం చిన్నారులు ఆయన కార్యాలయంలో కలిసి రాఖీలు కట్టారు. వైసీపీ ఇన్‌చార్జ్ బుర్రా మధుసూదన్‌యాదవ్‌కు ఆ పార్టీ మహిళా కార్యకర్తలు రాఖీలు కట్టారు.



ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు రాఖీలు కడుతున్న టీడీపీ మహిళాకార్యకర్తలు

కలిగిరి, ఆగస్టు 9 (ఆంధ్ర జ్యోతి): రాఖీపౌర్ణమి వేడుకలను మండలవాసులు శనివారం ఘనంగా జరుపుకున్నారు. సోదర సోదరీమణులు ఒకరికొకరు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

కొండాపురం: రక్షాబంధన్ పండుగను శనివారం మండల పరిధిలోని అన్ని గ్రామాలలో ఘనంగా జరుపుకున్నారు. చిన్నా, పెద్దా తేడాలేకుండా రాఖీలు కట్టించుకొని మిఠాయిలు పంచుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



కలిగిరి: క్రాకుటూరులో సోదరుడి చేతికి రాఖీకడుతున్న సోదరి



కొండాపురం: తమ్ముడికి రాఖీ కడుతున్న అక్క

బిట్రగుంట: బోగోలు మండలంలో రాఖీ వేడుకలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. కాగా, ప్రపంచ ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలకు వచ్చిన గిరిజన నేత బోగిరి ప్రభాకర్‌కు రాఖీ కట్టి జాతి కోసం పోరాడమని ఓ సోదరి దీవెనలిచ్చింది. మత్స్యకార మహిళ గిరిజన నేత కావాటి శ్రీనివాసులుకు రాఖీ కట్టింది.

లింగసముద్రం: అన్నా చెల్లెలు, అక్కా తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగ వేడుకలు మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. శనివారం లింగ సముద్రం, చినపవని, పెదపవని తదితర గ్రామాలలో అన్నలకు, తమ్ముళ్లకు చెల్లెల్లు, అక్కలు ఆత్మీయంగా రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. సోదరీమణులకు సోదరులకు బహుమతులు అందజేసి, ఎల్లప్పుడూ రక్షగా ఉంటామని భరోసా ఇచ్చారు.



బిట్రగుంట: గిరిజన నేత ప్రభాకర్‌కు రాఖీ కడుతున్న సోదరి

గిరిజనులకు దుప్పట్ల పంపిణీ

కావలి,ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): ఐసీసీ బ్యాంక్ ఆఫీసర్ సుభాన్ తన తల్లి హుస్సేన్‌బీ వర్ధంతిని పురస్కరించుకుని డాక్టర్ రామ్ సెంటర్ విశ్వోదయ ఆధ్వర్యంలో శనివారం కావలిపట్టణ కావేరి గుంట గిరిజనకాలనీలోని గిరిజనులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, ఐసీసీ బ్యాంక్ ఈక్విటీ ఆఫీసర్ వెంకట్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు అధికారులు దిలీప్, తులసి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



గిరిజనులకు దుప్పట్లు , పండ్లు పంపిణీ చేస్తున్న ఐసీసీ బ్యాంక్ ఆఫీసర్ సుభాన్, రాంసెంటర్ బాధ్యులు

గణేష్ విగ్రహ నిర్మాణానికి భూమిపూజ

- 27నుంచి నవరాత్రోత్సవాలు

కావలి(టౌన్)ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): స్థానిక మానస సెంటర్ గణేష్ నవరాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శనివారం కలుగోళశాంభవి ఆలయంలో మలిశెట్టి దంపతుల పర్యవేక్షణలో గణేష్ విగ్రహ నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించారు. అనంతరం మలిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలు ఈనెల 27న ప్రారంభమై సెప్టెంబరు 4 వరకు జరగనున్నాయని, గణేష్ మహరాజ్‌కు అఖండ దీపారాధన ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. విగ్రహం వద్ద ప్రత్యేక సెట్టింగులు ఏర్పాటు చేయనున్నామన్నారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి ఉత్సవాలు జయప్రదం చేయాలన్నారు.



గణేష్ విగ్రహ నిర్మాణానికి భూమి పూజ నిర్వహిస్తున్న మలిశెట్టి దంపతులు కమిటీ సభ్యులు

ఘనంగా ఆదివాసీ దినోత్సవం

బిట్రగుంట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం రామాపురంలో శని వారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సంద ర్భంగా ఏకలవ్యుని విగ్రహానికి పూలమా లలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ఎరుకుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి కావాటి శ్రీనివాసులు, ఏపీ ఎరుకుల గిరిజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బోగిరి ప్రభాకర్, గిరిజన నాయకులు చంద్రబాబు, ఏసేపు, క్రాంతి, సుధాకర్, కోటేశ్వరి, పద్మ, ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఏకలవ్యుడి విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎరుకుల సంఘనేతలు

ఐక్యంగా పోరాడితేనే గిరిజనాభివృద్ధి

- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మొగిలి

కావలి(టౌన్) ఆగస్టు9 (ఆంధ్రజ్యోతి) గిరిజనులందరూ ఐక్యంగా పోరాడితేనే గిరిజనాభివృద్ధి సాధ్యమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మొగిలి కల్లయ్య పేర్కొన్నారు. బీకే నగర్ గిరిజన కాలనీలో శనివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గిరిజన నాయకులు విజయకుమార్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా టీడీపీ పట్టణ కమిటి అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్ పాల్గొని ఏకలవ్యుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కల్లయ్య మాట్లాడుతూ బీకే నగర్‌లో మౌలిక వసతులు లేక గిరిజనులు అవస్థలు పడుతున్నారన్నారు. రూ.10కోట్ల నిధులతో ప్రత్యేక ప్యాకేజీతో బీకే నగర్‌లో రోడ్లు, డ్రైన్లు, తాగునీటి సౌకర్యం కల్పించాల్సిందిగా ఎమ్మెల్యే కృష్ణారెడ్డిని కోరనున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన నాయకులు బోగిరి ప్రభాకర్, స్థానిక టీడీపీ వార్డు ఇన్‌చార్జ్ మాల్యాద్రి, సీనియర్ నాయకులు రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

12న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

కలిగిరి, ఆగస్టు 9(ఆంధ్ర జ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య వైద్యకేంద్రంలో శనివారం వైద్యాధికారిణి డా. బిజ్జం గీతారెడ్డి జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమానికి సంబంధించి గోడపత్రికను ఆవిష్కరించారు. ఈనెల 12న మండలంలోని పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ఎఫ్ఎస్ మేరీ, సూపర్‌వైజర్ మహాలక్ష్మి, ఫార్మాసిస్ట్ విజయ, సిబ్బంది పాల్గొన్నారు.



పీహెచ్‌సీలో గోడపత్రిక ఆవిష్కరిస్తున్న గీతారెడ్డి

రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్ పోటీలకు చాకిచర్ల విద్యార్థి



పారా అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన ఎస్ చైతన్య

ఉలవపాడు, ఆగస్టు 9 (ఆంధ్ర జ్యోతి) : రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్ పోటీలకు మండలంలోని చాకిచర్ల జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి ఎస్ చైతన్య ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జనార్దన రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 9,10 తేదీల్లో విశాఖపట్నం పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో జరిగే సబ్ జూనియర్స్ షార్ట్‌పుట్ పోటీల్లో పాల్గొంటాడని పేర్కొన్నారు. గతనెల జూలైలో నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనపరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ ఓగుబోయిన శ్రీనివాసులు తెలిపారు. హెచ్ఎంతోపాటు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ సుధాకర్, గ్రామస్థులు చైతన్యకు అభినందనలు తెలిపారు.

హాస్టళ్లకూ మార్కులు!

(5వ పేజీ తరువాయి)

హాస్టళ్ల పనితీరును బట్టి ర్యాంకులు ఇవ్వాలని నిర్ణయించింది. ఈ విద్యా సంవత్సరం నుంచే ఈ విధానాన్ని అమలు చేసి వచ్చే ఏడాది ర్యాంకులు ప్రకటించనుంది. ఇందు కోసం ప్రత్యేకంగా ఆరు నిర్దేశిత అంశాలను విడుదల చేసింది.

● మొత్తం వంద మార్కులు..

ఆరు నిర్దేశిత అంశాలకు ప్రభుత్వం వంద మార్కులు కేటాయించింది. విద్యా-చదువులో పనితీరుకు 40 మార్కులు (హాస్టల్‌లో ఉన్న విద్యార్థుల ప్రగతికి 20, అద్భుత ఫలితాల సాధనకు మరో 20 మార్కులు) ఉంటాయి. అదేవిధంగా విద్యార్థుల హాజరు, రిటెన్షన్‌కు ఐదు వంతున 10 మార్కులు కేటాయించారు. మెనూ ప్రదర్శనకు రెండు, అమలుకు 10 మార్కులు కేటాయించారు. హాస్టల్‌లో అనుకోని ఘటనలు జరిగి, విద్యార్థులు ఇబ్బందిపడితే వాటికి స్పందించటం, ఉన్నతాధికారులకు తక్షణమే సమాచారం ఇవ్వడానికి మరో ఐదు మార్కులు కేటాయించారు. పరిశుభ్రత, పచ్చదనం, పారిశుధ్య నిర్వహణ, మౌలిక సదుపాయాలు కల్పనకు మరో ఐదు మార్కులు ఉంటాయి. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాల నిర్వహణకు 4, ఆరోగ్య పరీక్షల నిర్వహణకు 4, పీ-4 కార్యక్రమంలో భాగంగా స్ఫూర్తిదాయకమైన కార్యక్రమాల నిర్వహణ, వనరుల సమీకరణకు మరో 4 మార్కులు కేటాయించారు. క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం, విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దినందుకు 6, సాంకేతికత మెరుగుదల, ఆవిష్కరణకు 4 మార్కులు కేటాయించారు. హాస్టళ్లపై పత్రికల్లో వచ్చే కథనాలకు సంబంధించి అధికారుల వివరణకు 3 మార్కులను కేటాయించారు.

● వలంటీర్ల నియామకం

ప్రీమెట్రిక్ హాస్టళ్లలో ఉండే విద్యార్థులకు రాయడం, చదవటం, లెక్కలు వంటివి నేర్పించడానికి వలంటీర్లను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో ప్రీమెట్రిక్ హాస్టల్‌కు ఒక్కో వలంటీర్‌ను నియమించనున్నారు. వీరికి గౌరవవేతనం చెల్లించనున్నారు. జిల్లా బీసీ సంక్షేమాధికారి వెంకటలక్ష్మమ్మ మాట్లాడుతూ హాస్టళ్లలో పనితీరు మెరుగు, విద్యాప్రమాణాలు, వసతుల మెరుగుకు ప్రభుత్వం ర్యాంకులను ప్రవేశపెట్టినట్లు చెప్పారు.

నాపై నిందలు వేయడమంటే
ఆకాశంవైపు ఉమ్మి వేయడమే

- బెంగళూరులో కూర్చొని నీతిమాలిన రాజకీయాలు మానుకో
- ప్రభుత్వ ఆస్తి ధ్వంసం చేసిన వారిని వదిలేదే లేదు!
- మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌పై కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి ఫైర్



పైలాన్ ధ్వంసం చేసిన ప్రాంతాన్ని ఎమ్మెల్యేకు చూపుతున్న టీడీపీ నేత రామకృష్ణ

కావలి రూరల్ ఆగస్టు 9 (ఆంధ్ర జ్యోతి) : 'ప్రతాప్‌రెడ్డీ... నువ్వు నాపై అసత్య ఆరోపణలతో నిందలు వేస్తున్నావ్. నాపై నిందలు అంటే ఆకాశం వైపు ఉమ్మడమే. నేరుగా అది నీ ముఖాన్నే పడుతుంది.' అంటూ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డిపై కావలి ఎమ్మెల్యే దగ్గుమాటి వెంటకట కృష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కావలి మండలం తుమ్మలపెంటలో ఈ నెల 6వ తేదీ అర్ధరాత్రి వైసీపీ నేతలు పగలగొట్టిన పైలాన్, శిలాఫలకాల శిథిలాలను శనివారం ఎమ్మెల్యే పరిశీలించి వైసీపీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతాప్ అనుచరులైన తిరుపతి, రాజు, యానాది సారథ్యంలోనే ఈ శిలాఫలకాలను ధ్వంసం చేశారని ఆరోపించారు. ప్రభుత్వ స్థలంలో వైసీపీ హయాంలో ఏర్పాటు చేసిన జలజీవన్ మిషన్ పైలాన్, శిలాఫలకాలను ఆ పార్టీ నాయకులే పగలగొట్టించటం ఒక దుర్మార్గ పిరికిపంద చర్యగా అభివర్ణించారు. పదేళ్ల ఎమ్మెల్యేగా పని చేసిన ప్రతాప్‌రెడ్డిని 78 సంవత్సరాల స్వాతంత్ర్య చరిత్రలో 33వేల ఓట్ల మైనస్‌తో తరిమి కొట్టారని అన్నారు. కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టాలని చూస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. 'నువ్వు కావలికి వచ్చినప్పుడు నీ అంతు చూసేందుకు నీ ఇంటికే వస్తా. ఇది మా తప్పిదమే క్షమించండి అని చెప్పకపోతే నువ్వు ఎక్కడికి వెళ్లినా టీడీపీ అడ్డుకుంటుంది.' అంటూ ఘాటుగా మాట్లాడారు. ఈ సమావేశంలో టీడీపీ నేతలు ఆవుల రామకృష్ణ, పాలడుగు రంగారావు తదితరులు పాల్గొన్నారు.



SUNDAY SPECIAL



దట్టమైన అడవులుండే ప్రాంతం తలకోన. ఎర్రచందనం.. నాటుసారా గుట్టుగా లాగించెయ్యవచ్చు. ఈ ప్రాంతంపై ఇటీవల పోలీసు డ్రోన్‌ల నిఘా పెట్టారు. ఏప్రిల్ 27న ఎర్రావారిపాళెం మండలం వేములవాడ సమీపంలో అడవిపైన ఎగురుతున్న డ్రోన్‌కి అనుమానాస్పద సంకేతాలు అందాయి. వాటి ఆధారంగా కెమెరా జూమ్ చేశారు. తలకోన జలపాతం వాగు దగ్గరలోని ఒక చెట్టు తొర్రలో నుంచి సిగ్నల్స్ అందుతున్నాయి. తీరా చూస్తే చెట్టు తొర్రలో 10 లీటర్ల నాటుసారా ఉంది. ఈ సంఘటనలో ఇద్దరు నాటుసారా తయారీదార్లను వెంటనే అదుపులోకి తీసుకున్నారు.

తిరుపతి రూరల్ మండలంలో స్వర్ణముఖి నదీ తీరం కంపచెట్లతో నిర్జనంగా ఉంటుంది. ఈ ప్రాంతంపై ఎగురుతున్న డ్రోన్ కెమెరా కంట్లో పొదల్లో ఏదో కదలిక పడింది. జూమ్ చేసి చూడగా కొంతమంది అక్కడ డ్రగ్స్ తీసుకుంటున్నారు. ఇంజక్షన్‌లు, మత్తు బిళ్లలు కనిపించాయి. వెంటనే బీట్ పోలీసులకు సమాచారం అందింది. 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. శంకర్‌నాయుడు కాలనీ సమీపంలో జూన్ 18న ఈ సంఘటన జరిగింది.



రారాజును చూద్దాం.. రారండి

● నేడు సింహాల దినోత్సవం

6

ఆకాశ గూఢచారి

తిరుచానూరు సమీపంలోని పాడుపడ్డ భవనాల మీద డ్రోన్ నిఘా పెట్టారు. నలుగురు యువకులు గంజాయి సేవిస్తూ దొరికిపోయారు. ఎనిమిది ప్యాకెట్లు గంజాయి స్వాధీనం చేసుకున్నారు.



● తిరుపతి పోలీసులకు అందిన హై టెక్నాలజీ డ్రోన్లు

కథనం - ఆంధ్రజ్యోతి, తిరుపతి(నేరవిభాగం)

తిరుపతి జిల్లా పోలీసుల పొదిలోకి ఇటీవల అందిన ఒక సాంకేతిక ఆయుధం డ్రోన్. భిన్న అవసరాలకు ఉపయోగపడే, వివిధ సామర్థ్యాలున్న 9 డ్రోన్‌లు ప్రభుత్వం తిరుపతికి కేటాయించింది. దేశ నలుమూలల నుంచి వచ్చే జనంలో నేరస్తులు సులువుగా కలగలిసిపోయే అవకాశమున్న ప్రాంతం కావడంతో వీటి అవసరం మరీ ఎక్కువ. అలాగే తరచూ వీవీఐపీల పర్యటనలు, భారీ సభలు జరుగుతుండడంతో క్రౌడ్ కంట్రోల్‌కి కూడా డ్రోన్‌ల సాయం పోలీసులకు బాగా ఉపయోగపడుతోంది. నేరస్తుల గుండెల్లో దడపుట్టించే పనులను ఈ డ్రోన్‌లు చేస్తున్నాయి. జిల్లా పోలీసు విభాగానికి అందిన డ్రోన్‌లు.. వాటి విశేషాలు...

టెథర్డ్ డ్రోన్
బాహుబలి

ఈ డ్రోన్ అత్యంత శక్తివంతమైంది. తిరుపతి వంటి భక్తజనం వచ్చిపోయే ప్రదేశంలో దీని అవసరం ఎక్కువ అని గుర్తించారు. దీని విలువ రూ.30లక్షలు. 100 నుంచి 140 మీటర్ల ఎత్తులోనే ఎగురుతూ అయిదు కిలోమీటర్ల దూరం వరకూ తిరుగుతూ పర్యవేక్షిస్తుంది. ఐదు కిలోల బరువున్న వస్తువులను కూడా దీనిద్వారా అత్యవసర సమయాల్లో



చేరవేయవచ్చు. దాదాపు 8 గంటల పాటు నిరంతరాయంగా ఎగరగల సామర్థ్యం దీనికి ఉంటుంది. ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి వంటి వీవీఐపీల పర్యటనల సమయంలో పోలీసులకు బాగా ఉపయోగపడుతుంది. దాదాపుగా 30 కిలోల బరువుంటుంది.

డీజేఐ ఏయిర్ త్రీ ఎస్
ట్రాఫిక్ కంట్రోలింగ్

ఈ డ్రోన్ దాదాపు ఒక కిలోమీటరు ఎత్తు వరకూ ఎగురుతుంది. ఇక్కడి నుంచి ఐదు కిలోమీటర్ల రేడియస్‌లో ఫొటోలు తీస్తుంది. ట్రాఫిక్ నియంత్రణకు బాగా ఉపయోగపడుతుంది. రాంగ్ పార్కింగ్, ఫుట్‌పాత్‌ల ఆక్రమణ, ఆపోజిట్ రూట్‌లో రావడం,, త్రిబుల్ రైడింగ్ వంటివి గుర్తుంచి చలానాలు వేయడంలో పోలీసులకు బాగా సహకరిస్తుంది. ఇక ర్యాలీలు, ధర్నాలు, జాతర్ల సమయంలో ఇది నింగిలోంచి నిఘా పెడుతుంది. అలాగే నగర శివారు ప్రాంతాల్లో, పాడుబడ్డ భవనాల వద్ద అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడేవారిని గుర్తిస్తుంది. ఇవి జిల్లాలో ఏడు ఉన్నాయి.



మ్యాట్రిక్స్ 4టీ థర్మల్
ఆకాశంలో నిఘా



దాదాపుగా కంటికి కనిపించనంత ఎత్తున ఎగురుతుంది ఈ డ్రోన్. నాలుగు నుంచి ఆరు కిలోమీటర్ల ఎత్తు దాకా ఎగురగలదు. అతి తక్కువ శబ్దం చేస్తుంది. నైట్ విజన్ కెమరాలు ఉన్నందున చిమ్మచీకటిలోనూ ఫొటోలు తీస్తుంది. 5 కిలోమీటర్ల రేడియస్‌లోని ఫొటోలు తీయగలదు. ఈ డ్రోన్‌లో 112ఎక్స్ జూమింగ్ కెమెరా ఉన్నందున అంత ఎత్తు నుంచి కూడా క్లోజప్ ఫొటోలు తీయగలదు. ఒకరకంగా ఇది నింగిలో నుంచి నేలమీద నిఘాకు బాగా ఉపయోగపడుతుంది. ఏఐ టెక్నాలజీ ఉంది. రద్దీ ప్రాంతాల్లో ఎంతమంది ఉన్నారో కూడా లెక్కకట్టి చెప్పేస్తుంది. రహదారుల్లో ప్రయాణించే వాహనాల నంబర్లను కూడా జూమ్ చేసుకుని గుర్తించి నిక్షిప్తం చేసుకుంటుంది. గుద్దేసి వెళ్లిపోయే వాహనాలను ఇట్టే పట్టేస్తుంది. ఈ డ్రోన్‌లో స్పాట్ లైట్, స్పీకర్ కూడా అమర్చబడి ఉంటాయి. అత్యవసర సమయాల్లో ఈ స్పీకర్ ద్వారా ప్రజలను అప్రమత్తం చేసే వీలుంది. ప్రజల్ని హెచ్చరించడానికి అనువుగా సైరన్ కూడా ఉంటుంది. భారీ భవనాల్లో అగ్నిప్రమాదాలు, వరదలు వంటి సమయాల్లో చాలా ఉపయోగపడుతుంది. ఇవి జిల్లాలో రెండు ఉన్నాయి.

రేపు శ్రీకాళహస్తిలో పీజీఆర్ఎస్

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నారు. ఉదయం 9గంటల నుంచి పంచాయతీరాజ్ అతిథిగృహంలో జరుగుతుంది. కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి పాల్గొననున్నారు. నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ శనివారం విడుదల చేసిన ప్రకటనలో కోరారు. అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని తెలిపారు.

వైభవంగా శ్రావణ పౌర్ణమి గరుడసేవ

- భారీ సంఖ్యలో పాల్గొన్న భక్తులు -



తిరుమల, ఆగస్టు9 (ఆంధ్రజ్యోతి): గోవింద నామస్మరణలు, మంగళ వాయిద్యాలు, వేదమంత్రాల నడుమ శ్రావణ పౌర్ణమి సందర్భంగా తిరుమలలో శనివారం గరుడ వాహన సేవ వైభవంగా జరిగింది. విశేష అలంకరణలో మలయప్పస్వామి తన ఇష్టవాహనమైన గరుడుడిపై కొలువుదీరి నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 7 గంటలకు ప్రారంభమైన వాహనసేవ 9 గంటల వరకు సాగింది. శ్రావణ పౌర్ణమి కావడంతో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని ఉత్సవమూర్తిని దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాలు సెప్టెంబరు 24 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి జరిగిన గరుడసేవను టీటీడీ ట్రయల్ రన్‌గా భావించి అదనపు ఈవో వెంకయ్య చౌదరి అధికారులకు పలు సూచనలు చేశారు. వీలైనంత ఎక్కువ మంది భక్తులు గరుడవాహన సేవను వీక్షించేలా తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీయర్‌స్వాములు, బోర్డు సభ్యులు రంగశ్రీ, దివాకర్‌రెడ్డి, జానకీదేవి, డిప్యూటీ ఈవో లోకనాథం పాల్గొన్నారు.



జిల్లాలో ఉపాధి కార్డులు : 2,68,530
పనికి హాజరయ్యే వారు : 60వేల మంది
సగటు ఉపాధి దినాలు : 50 రోజులు
రోజువారీ వేతనం : రూ.281

దొంగ మస్టరు వేస్తే దొరికినట్టే..

● రేపటి నుంచి ముఖ ఆధారిత హాజరు ● ఏఐ సాయంతో ఉపాధి అక్రమాలకు చెక్

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో దొంగమస్టర్లకు అడ్డుకట్టపడనుంది. ఇందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త విధానాన్ని ప్రవేశపెట్టింది. సోమవారం నుంచి జిల్లా వ్యాప్తంగా ఏఐ ముఖ ఆధారిత హాజరు అమల్లోకి రానుంది. ఇప్పటివరకూ క్షేత్రస్థాయిలో పది మంది పనిచేస్తుంటే 50 మందికి మస్టర్లు వేసేవారు. నిధులు పక్కదారి పట్టించేవారు. ఫీల్డ్ అసిస్టెంట్లు పట్టించుకునేవారు కాదు. కళ్లు మూసుకుని రికార్డుల్లో నమోదు చేసేవారు. ఇలాంటి అక్రమాలను చెక్ పెట్టేందుకు నేషనల్ మస్టర్ మానటరింగ్ సిస్టం(ఎన్ఎంఎంఎస్) ఆధ్వర్యంలో అధునాతన సాంకేతిక పరిజ్ఞాన ప్రక్రియ అందుబాటులోకి రానుంది.

ముఖ ఆధారిత హాజరు ఇలా...

ముఖ ఆధారిత హాజరు విధానంలో కూలీల ఫొటో మొబైల్‌లో ముందుగా తీసి ఎన్ఎంఎంఎస్ అప్‌లోడ్ చేస్తుంది. ఉదయం, సాయంత్రం పని ప్రదేశంలో కూలీల ఫొటోలు అప్‌లోడ్ చేస్తారు. ఒకరి తరఫున మరొకరు హాజరైతే ఫొటోలను యాప్ అనుమతించదు. ఒకే పేరుతో మూడు నాలుగు చోట్ల వేర్వేరు పేర్లతో హాజరైనా కుదరదు. క్షేత్రస్థాయిలో తప్పుడు మస్టర్లు వేయడానికి వీలుపడదు.

గతంలో భారీ అవకతవకలు

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద గత ఐదేళ్లలో దాదాపు రూ.20కోట్ల మేర అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. తిరుపతి జిల్లాలోనే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.5కోట్ల వరకు అక్రమాలు బయటపడ్డాయి. వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీకి చెందిన గ్రామస్థాయి నేతలు, క్షేత్రస్థాయి సిబ్బంది కుమ్మక్కై దొంగ మస్టర్ల ద్వారా దోచేశారు. మృతి చెందినవారి పేరుతోనూ స్వాహా చేశారు. ఈ మూడేళ్లలో రూ.70లక్షల వరకు రికవరీ చేశారు. ఇలాంటి అక్రమాలను కట్టడి చేసేందుకు ముఖ హాజరు ఉపయోగపడుతుందని, దీనిపై ఉపాధి హామీ సిబ్బందికి ఇటీవల శిక్షణ ఇచ్చామని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు.



ఉపాధి కూలీని తీస్తున్న ముఖ ఆధారిత యాప్

శ్రీవారి ఆలయం వద్ద సీపీఐ నారాయణ

తిరుమల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాయణ శనివారం తిరుమల శ్రీవారి ఆలయం ముందు కొంత సమయం గడిపారు. భక్తులను ఆప్యాయంగా పలకరించారు. దర్శనానంతరం ఆలయం నుంచి వెలుపలకు వచ్చిన మాజీ మంత్రి రోజాను చూసి పలకరించారు. పక్కనే ఉన్న కుటుంబ సభ్యులతో ఫొటో దిగారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దాదాపు 35 ఏళ్లగా సీపీఐ కార్యాలయంలో సెక్రటరీగా పనిచేసిన గోవిందు కుమార్తె వివాహానికి హాజరయ్యేందుకు తిరుమలకు వచ్చినట్టు తెలిపారు. 'గుడికి పోలేదు. ఇలా వస్తే గుడికి పోనీయరు కదా' అంటూ తన దుస్తులను చూపుతూ నవ్వారు. శ్రీవారి దర్శనానికి భక్తులు బాగానే వస్తున్నారని, ఆదాయం, సౌకర్యాలు బాగున్నాయని అన్నారు.



నారాయణ, రోజా పలకరింపులు



చంద్రగిరి కోటపై మువ్వన్నెల మెరుపులు

చంద్రగిరి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి కోట త్రివర్ణ పతాకం రంగుల్లో మెరిసిపోతోంది. స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని హర్‌ఘర్ తిరంగ్‌లో భాగంగా రాజమహల్‌కు జాతీయ జెండా రంగుల్లో దేదీప్యమానంగా విద్యుద్దీపాలంకరణ చేశారు. ఈనెల 15 వరకు కాంతులీనుతున్న ఈ మువ్వన్నెల రంగులు సందర్శకులను మురిపించనున్నాయి. శనివారం రాత్రి చంద్రగిరి కోట సీఏ బాలకృష్ణారెడ్డి పర్యవేక్షణలో ఈ విద్యుదీపకాంతులను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కోట నిర్మించి 500 సంవత్సరాలు దాటినా భావితరాలకు కోసం చెక్కుచెదరకుండా పురావస్తుశాఖ కాపాడుతోందన్నారు. రాత్రి 7 గంటలకు ఈలైటింగ్ షోను ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

విజిలెన్స్ ఎస్పీకి ఐపీఎస్ హోదా



తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): తిరుపతి విజిలెన్స్ ఎస్పీ కరీముల్లా షరీఫ్‌కు ఐపీఎస్ హోదా కల్పిస్తూ కేంద్ర హోంశాఖ కార్యదర్శి సంజీవ్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 14 మంది నాన్ కేడర్ ఎస్పీలకు సీనియారిటీ ప్రాతిపదికన అర్హత మేరకు ఐపీఎస్ హోదా కల్పించారు. ఇందులో తిరుపతి విజిలెన్సు విభాగంలో పనిచేస్తున్న కరీముల్లా షరీఫ్‌కు అవకాశం దక్కింది. 2011లో పోలీసు శాఖలో డీఎస్పీ హోదాలో చేరిన ఆయన రాష్ట్రవ్యాప్తంగా వివిధ క్యాడర్లలో పనిచేశారు.

పవన్‌ను బంధించింది ఎవరు?

తిరుపతి నుంచి చిత్తూరుకు ఎలా వెళ్లాడు?

వైసీపీ దాడి ఘటనపై కొనసాగుతున్న దర్యాప్తు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతల చేతిలో దారుణ హింసకు గురైన పవన్‌కుమార్‌ను చిత్తూరులో బంధించింది ఎవరు? అతని వాయిస్ రికార్డు చేసి వీడియోలు విడుదల చేసిందెవరు? తిరుపతిలో దాడికి గురైన పవన్ చిత్తూరుకు ఎలా వెళ్లాడు? రౌడీ మూకలకు భయపడి తలదాచుకున్నాడా? లేకుంటే ఎవరైనా బలవంతంగా తీసుకెళ్లి బంధించారా అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఈ వ్యవహారంలో తిరుపతికి చెందిన వైసీపీ కీలక నేతల ప్రమేయంపైనా ఆరా తీస్తున్నారు.

గొడవకు కారణాలపై ఆరా

తిరుపతిలోని ఒక హోటల్‌లో రిసెప్షనిస్టుగా పనిచేస్తున్న పవన్‌కుమార్‌ను, వైసీపీ నేతలకు మధ్య గొడవకు గల కారణాలపైనా పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. కేవలం డబ్బు వ్యవహారమేనా లేదా పాత కక్షలు ఏమైనా ఉన్నాయా అని ఆరా తీస్తున్నారు.

దర్యాప్తు వేగవంతం

ఈ ఘటనను ప్రభుత్వ పెద్దలు సీరియస్‌గా తీసుకోవడంతో జిల్లా పోలీసులు దర్యాప్తులో వేగం పెంచారు. అదనపు ఎస్పీ నేతృత్వంలో డీఎస్పీ, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది టీమ్‌లుగా విడిపోయి దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే వైసీపీ సోషల్ మీడియా అధ్యక్షుడు అనిల్‌కుమార్ రెడ్డి, బైక్ రెంటల్ అధినేత జగదీశ్వరరెడ్డిలను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. పోలీసుల అదుపులో ఉన్న మరో నిందితుడు దినేష్‌ను విచారిస్తున్నారు. మరికొందరు అనుమానితుల పాత్రపై దర్యాప్తు చేస్తున్నారు.

తిరుమలలో వైభవంగా శ్రావణ ఉపకర్మ



తిరుమలలో శనివారం శ్రావణ పౌర్ణమి సందర్భంగా శ్రావణ ఉపకర్మ-నూతన యజ్ఞోపవీత ధారణ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా ఉదయం 6 గంటలకు శ్రీకృష్ణస్వామిని భూవరాహస్వామి ఆలయానికి ఊరేగింపుగా తీసుకువచ్చి స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీళ్లు, పసుపు, చందనంతో అర్చకులు అభిషేకించారు. అనంతరం స్వామివారికి నూతన యజ్ఞోపవీతాన్ని సమర్పించి, ఆస్థానం నిర్వహించారు. తర్వాత శ్రీకృష్ణస్వామిని ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి వేంచేపు చేశారు. ఈ కార్యక్రమంలో పారుపత్తేదార్ హిమంతగిరి, అర్చకులు, ఇతర ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

చెత్తరహిత రాష్ట్రం దిశగా పనులు ప్రారంభించాం

● స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి రామ్



తిరుమల, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని చెత్త రహితంగా మార్చే దిశగా పనులు ప్రారంభించామని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ తెలిపారు. తిరుమల శ్రీవారిని శనివారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న తర్వాత పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని, వీటికి శ్రీవారి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నామని చెప్పారు. చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత మొక్కు చెల్లించుకునేందుకు కాలినడకన తిరుమలకు వచ్చానన్నారు. రాష్ట్రంలోని ఐదు కోట్ల మంది ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, అభివృద్ధి వైపు నడవాలని కోరుకున్నట్టు చెప్పారు.

శ్రీవారి సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 4 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.3.17 కోట్లు
శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 70,480
తలనీలాలు సమర్పించినవారు: 28,923



రారాజును చూద్దాం.. రారండి



జూపార్కులో లయన్ సఫారీ వాహనం

మంగళం ఆంధ్రజ్యోతి

సింహం.. అడవికి రారాజు.. ధైర్యసాహసాలకు మారుపేరు. వేటాడటంలో దీని నైపుణ్యమే వేరు. బాల్యంలో కథా వస్తువుగా నిలిచే ఈ మృగరాజు ఆఫ్రికన్ దేశాల్లో హవా చాటుకుంటున్నా మనదేశంలో అంతరించిపోతున్న జంతువుల జాబితాలో చేరిపోయింది. గుజరాత్ లాంటి కొన్ని రాష్ట్రాల అడవుల్లో మాత్రమే ఉనికి చాటుకుంటోంది. ఐదేళ్ల క్రితం నాటికి 674 సింహాలు మాత్రమే ఉన్నట్లు లెక్క తేలింది. మన రాష్ట్రంలో ప్రదర్శన శాలలకు, సర్కస్‌లో వినోదానికి పరిమితమవుతోంది. ఆదివారం సింహాల దినోత్సవం సందర్భంగా తిరుపతి ఎస్వీ జూపార్క్‌లోని సింహాల గురించి తెలుసుకుందాం.. చూసొద్దాం రండి...

జూ పార్కులో పది సింహాలున్నాయి. వీటిలో ఐదు మగవి, ఐదు ఆడవి. వీటిలో బయట ఎన్‌క్లోజర్‌లో రెండు ఆడ, ఒక మగ సింహం ఉన్నాయి. లయన్స్ సఫారీలో నాలుడు ఆడవి, మూడు మగవి ఉన్నాయి. 2001లో సర్కస్ నుంచి తీసుకువచ్చిన 87 సింహాలలో వయసు పైబడి 86 చనిపోయాయి. వీటిలో ఒక్కటి మాత్రమే సజీవంగా ఉంది. ఈ మృగరాజుల సాధారణ వయసు 24ఏళ్లు. అడవిలో ఉండేవి 14 సంవత్సరాలు మాత్రమే బతుకుతాయని ఫారెస్ట్ అధికారులు చెబుతున్నారు. జూపార్కుల్లో సింహం 20 సంవత్సరాలకు పైగా బతుకుతుంది. సర్కస్ నుంచి తీసుకువచ్చిన సింహాలకు పుట్టినవే ఇప్పుడు జూపార్కులో సందర్శకులకు కనువిందు చేస్తున్నాయి.

■ నేడు సింహాల దినోత్సవం



జూపార్కులో సందర్శకులను ఆకట్టుకుంటున్న సింహాలు

సఫారీ సందర్శనకు వాహనాలు

జూపార్కులో సింహాల సఫారీలోని వెళ్లే సందర్శకుల కోసం ఆరు వాహనాలను ఏర్పాటు చేశారు. పెద్దలకు రూ.50, పిల్లలకు రూ.30గా టిక్కెట్ వసూలు చేస్తున్నారు. ఈ వాహనంలో ప్రయాణిస్తూ సింహాలను దగ్గరగా చూసేందుకు అవకాశం ఉంటుంది. సింహాలు సందర్శకులపై దాడి చేయకుండా ఈ వాహనాలను కట్టుదిట్టమైన ఇనుప కంబీలతో ఏర్పాటు చేశారు.

రోజువారీ ఆహారమిలా..

జూపార్కులో సింహాలకు రోజూ అర లీటరు పాలు, ఐదు నుంచి ఆరు కేజీల బీఫ్, రెండు కేజీల చికెన్, రెండు కోడిగుడ్లు వంతున ఆహారంగా అందిస్తున్నారు. వీటి సంరక్షణలో జంతు ప్రేమికులను భాగస్వాములుగా చేయడానికి అధికారులు అవకాశం కల్పిస్తున్నారు. దత్తత తీసుకునేందుకు ఆహ్వానం పలుకుతోంది. రోజుకు అయ్యే ఖర్చు రూ.1,330, వారానికి రూ.9,310, నెలకు రూ.39,900, మూడు నెలలకు 1,19,700 ఆరు నెలలకు రూ.2,39,400, సంవత్సరానికి రూ.4,85,450 మొత్తాన్ని జూపార్కు అధికారులకు అందజేయాల్సి ఉంటుంది. ఇలా చేస్తే మీరు కూడా సింహాల సంరక్షణలో భాగస్వాములయినట్లే.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో మాజీ మంత్రి ఆర్కే రోజా, ఎమ్మెల్సీ కల్యాణి, కలెక్టర్ వెంకటేశ్వర్ ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు. దర్శనానంతరం రోజా ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ శ్రావణమాసం, శ్రావణ నక్షత్రం, శనివారం రోజున శ్రీవారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. తన కుటుంబంతోపాటు రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉండాలని శ్రీవారిని కోరుకున్నట్టు చెప్పారు.

పవన్ దాడి వెనుక భూమన హస్తం

- శాప్ చైర్మన్ రవినాయుడు -

తిరుపతి, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): దళిత యువకుడు పవన్‌పై దాడి వెనుక వైసీపీ నేతలు భూమన కరుణాకర రెడ్డి, అభినయ్ హస్తముందని శాప్ చైర్మన్ రవినాయుడు ఒక ప్రకటనలో ఆరోపించారు. పవన్‌ను బెదిరించి వారికి అనుకూలంగా వీడియో చేయించారని, భూమన కుటుంబం వల్ల ప్రాణహాని ఉందని తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. అభినయ్ ప్రధాన అనుచరుడు ఉదయ్ వంశీ ద్వారా దాడి అనంతరం పవన్‌ను కిడ్నాప్ చేశారని తెలిపారు. ఈ క్రతువుకు డబ్బు సమకూర్చింది అభినయ్ అని ఆరోపించారు. కిడ్నాపర్లు, ఉదయ్ వంశీల ఫోన్ పేలు చెక్ చేస్తే అన్ని ఆధారాలు బయటపడతాయని వివరించారు. కరుణాకరరెడ్డి, అభినయ్‌లపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండు చేశారు.

తిరుమలలో విజయనగరం జిల్లావాసి అదృశ్యం



సురేష్ (ఫైల్ ఫొటో)

తిరుమల, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన విజయనగరం జిల్లావాసి కనిపించడం లేదంటూ శనివారం తిరుమల టూటౌన్ పోలీస్టేషన్‌లో కేసు నమోదైంది. విజయనగరం జిల్లా, కస్పితి మ్మాపురానికి చెందిన సురేష్(37) గత నెల 19వ తేదీన కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలకు వచ్చాడు. అదే రోజు తిరుమలలోని యాత్రిసదన్ వద్ద కనిపించకుండా పోయాడు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులు అతని కోసం తిరుమల, తిరుపతి, సొంత ఊర్లలో గాలించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో శనివారం తిరుమల టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సురేష్ వివరాలు తెలిసిన వారు 9440796772కు తెలియజేయాలని కోరారు.

14 కిలోల మారవ



సదుం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి):సదుం మండలంలోని తిమ్మానాయనిపల్లె పంచాయతీ కొర్లకుంటవారిపల్లె ప్రాజెక్టు నుంచి వచ్చే గార్గేయ నది నీటిలో సుమారు 14 కిలోల మారవ చేప వలకు చిక్కింది.భార్గవ్ అనే యువకుడు శనివారం వేసిన వలకు సుమారు మూడడుగుల పొడవున్న మారవ చిక్కుకోవడంతో ఉబ్బితబ్బిబ్బైపోయాడు. ఈ చేపను చూసేందుకు చిన్నారులు ఎగబడ్డారు.

కనులపండువగా వరసిద్ధుడి కల్యాణోత్సవం

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం కాణిపాక ప్రధాన ఆలయంలోని కల్యాణ వేదిక వద్ద సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధుడికి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. తొలుత కల్యాణ వేదిక వద్ద స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణోత్సవం ముగిసిన అనంతరం సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధుడికి ప్రధాన ఆలయం ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు.

జోరుగా బ్రహ్మోత్సవ ఏర్పాట్లు



బ్రహ్మోత్సవాలకు సిద్ధమవుతున్న శ్రీవారి తేరు, పుష్కరిణి



తిరుమల, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): తిరుమలలో సెప్టెంబరు 24 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు జరుగనున్న శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. టీటీడీ ఏడాదికోసారి టీటీడీ అత్యంత వైభవంగా నిర్వహించే బ్రహ్మోత్సవాలు సమీపిస్తున్న క్రమంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు టీటీడీ ఇంజినీరింగ్ విభాగం ఏర్పాట్లను ప్రారంభించింది. ఇందులో భాగంగా ప్రస్తుతం శ్రీవారి మహారథం (చెక్కతేరు)ను సిబ్బంది సిద్ధం చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. అలాగే మాడవీధుల్లోని విద్యుత్ లైట్లకు మరమ్మత్తులు చే పట్టారు. పాడైపోయిన లైట్లను తొలగించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు. అలాగే శ్రీవారి పుష్కరిణిలోని నీటి ఇప్పటికే తొలగించి లోపులన్న బావుల్లో, నీటి పైపులకు మరమ్మత్తులు చేస్తున్నారు. ఈనెలాఖరులోగా పనులన్నీ పూర్తిచేసిన తిరిగి నీటిని నింపనున్నారు. ఇక, మాడవీధులు, ఆలయ పరసర ప్రాంతాల్లో బారికేడ్లు, గ్యాలరీలను ఏర్పాటు చేసే పనులు కూడా మొదలయ్యాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

తిరుపతిలో దళిత యువకుడిపై దాడి దుర్మార్గం

● సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

తిరుపతి, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో దళిత యువకుడిని గదిలో బంధించి వైసీపీ నాయకులు దాడి చేయడం దుర్మార్గపు చర్య అని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దాడి చేసిన వారు భూమన కరుణాకరరెడ్డి, అతని తనయుడు అభినయ్ అనుచరులని ప్రచారం సాగుతున్న నేపథ్యంలో వైసీపీ అధ్యక్షుడు జగన్మోహనరెడ్డి ఖండించకపోవడం వెనుక అంతర్యమేమిటని ప్రశ్నించారు. నిందితులు కరుణాకరరెడ్డి ఇంటి వద్ద అరెస్టు కావడంపై వారిపైనే అనుమానం వస్తోందని తెలిపారు. మోదీ ప్రభుత్వం కేవలం చంద్రబాబు, నితీష్ వల్ల మనుగడ సాగిస్తోందన్నారు. అమెరికా అధ్యక్షుడు ప్రపంచ పోలీస్‌గా వ్యవహరిస్తున్నారని, ట్రంప్‌ను మోదీ ఇప్పటివరకు వ్యతిరేకించడం లేదని తెలిపారు. ట్రంప్ ఆర్థిక ఆంక్షల పేరుతో బ్లాక్ మెయిల్ చేస్తున్నా మోదీకి జ్ఞానోదయం కాకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రచారంలో ఉన్న దొంగ ఓట్ల జాబితా ఎన్నికల కమిషన్ నిర్లక్ష్యపు పనితీరుకు అద్దం పడుతోందన్నారు. గతంలోనే ఓట్ల చేర్పులు, తొలగింపులపై తిరుపతిలో జరిగిన ఎన్నికల సందర్భంగా ఆధారాలతో సీపీఐ ఆధ్వర్యంలో చూపించామని గుర్తు చేశారు. ప్రస్తుతం రాహుల్ గాంధీ జాతీయ స్థాయిలో నిరూపించారని అన్నారు. ఎన్నికల కమిషన్ ప్రజాస్వామ్యబద్దంగా వ్యవహరించలేదన్నారు. స్వతంత్ర సంస్థలుగా పనిచేయాల్సిన వ్యవస్థలు మోదీ నియంత్రణలోకి వెళ్లిపోయాయన్నారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటుపై న్యూయార్క్ కోర్టులో మాజీ ముఖ్యమంత్రిపై కేసు నడుస్తోందన్నారు. స్మార్ట్ మీటర్లు అమర్చితే దేశ వ్యాపితంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ మీడియా సమావేశంలో సీపీఐ నేతలు హరినాథ్ రెడ్డి, పి.మురళి, చిన్నం పెంచలయ్య, రాధాకృష్ణ, చంద్రశేఖర్‌రెడ్డి, విశ్వనాథ్‌లు పాల్గొన్నారు.

ఊపిరితిత్తుల సమస్యలకు ఆధునిక వైద్య పద్ధతులు

● వైద్యరంగంలో పల్మనాలజిస్టుల పాత్ర కీలకం ● అప్సకాన్ జాతీయ సదస్సులో ఎమ్మెల్యే ఆరణి



అప్సకాన్ సదస్సులో పాల్గొన్న ప్రముఖ వైద్య నిపుణులు, నేతలు

తిరుపతి(వైద్యం), ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఊపిరితిత్తుల సమస్యను నివారించేందుకు ఆధునిక వైద్య పద్ధతులు అందుబాటులోకి వస్తున్నాయని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. మంగళం సమీపంలోని ఆశా కన్వెన్షన్‌లో అప్సా (ఆంధ్రప్రదేశ్ సీమాంధ్ర పల్మనాలజిస్టుల అసోసియేషన్) ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ ప్రేమానంద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ సుబ్బారావుల ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి 6వ వార్షికోత్సవ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆస్మా, టీబీ, సీవోపీడీ, న్యూమోనియా వంటి ఊపిరితిత్తుల సమస్యల పరిష్కారంలో పల్మనాలజిస్టుల పాత్ర ఎంతో కీలకమన్నారు. రుయాస్పత్రి పరిధిలో సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్ ఆఫ్ పల్మనాలజీ ఏర్పాటుకు సహకరించాలని ఎమ్మెల్యేకు అసోసియేషన్ ప్రతినిధులు విన్నవించారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం పల్మనాలజీ రంగంలో చోటు చేసుకుంటున్న మార్పులు, నూతన పద్ధతుల గురించి వైద్య నిపుణులు వివరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ చంద్రశేఖర్, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ చైర్మన్ శ్రీహరిరావు, హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, టీటీడీ బోర్డు సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్, ఎస్వీ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్, రుయా సూపరింటెండెంట్ రాధ, సైంటిఫిక్ కమిటీ సభ్యురాలు డాక్టర్ నీతిచంద్ర పాల్గొన్నారు.

విద్య ద్వారానే ఉన్నత శిఖరాలకు

● ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో కలెక్టర్



గిరిజన విద్యార్థులకు పారితోషికం అందజేస్తున్న కలెక్టర్

తిరుపతి(విద్య), ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఎవరైనా ఉన్నత శిఖరాలకు ఎదగాలంటే విద్య ద్వారా మాత్రమే సాధ్యమని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అన్నారు. స్థానిక గిరిజన భవన్‌లో శనివారం జరిగిన అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవంలో కలెక్టర్ ప్రసంగించారు. జిల్లాలో గిరిజనులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు తన దృష్టిలో ఉన్నాయన్నారు. గిరిజన భవన్ మరమ్మతుల నుంచే పనులు ప్రారంభిస్తామన్నారు. నెలాఖరులోపు రూ.20 లక్షలు మంజూరుకు చర్యలు తీసుకుంటానన్నారు. తుడా చైర్మన్, కార్పొరేషన్ వారితో మాట్లాడి అదనంగా మరో రూ.10 లక్షలు మంజూరు చేయాలని కోరుతానని అన్నారు. మూడు నెలల్లో ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాల మంజూరుకు చర్యలు తీసుకుంటానని, ఎస్టీ విద్యార్థుల కోసం ప్రత్యేక జాబ్‌మేళా ఏర్పాటు చేస్తామన్నారు. ఆదివాసులు ఉన్న ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించి ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. తాను 5 కుటుంబాలను దత్తత తీసుకున్నానని వచ్చే 6 నెలల్లో వారి అవసరాలను సంపూర్ణంగా నెరవేరుస్తానని పేర్కొన్నారు. జిల్లాలో 82 వేల కుటుంబాలను గుర్తించి వారిలో 42 వేల కుటుంబాలను పలువురు దత్తత తీసుకున్నారని వివరించారు. ఏపీ హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడుతూ ఆదివాసులను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. అనంతరం 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులకు కలెక్టర్ పారితోషికం అందజేశారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, గిరిజన సంక్షేమశాఖ అధికారి రాజాసోము, గిరిజన సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, గిరిజన సంక్షేమ సంఘం అధ్యక్షులు కృష్ణ, బంజార సంఘం అధ్యక్షుడు తలపుల మల్లికార్జున, గిరిజన సంఘం కార్యనిర్వహక కార్యదర్శి సుమన్, యానాది సంఘం మహిళా కార్యదర్శి వసంతమ్మ, విశ్రాంత డీఎఫ్‌వో. టీటీడీ ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సురుటుపల్లె ఆలయ చైర్మన్ రేసులో ఆ నలుగురు



సత్యవేడు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): నాగలాపురం మండలం సురుటుపల్లె పళ్లికొండేశ్వరాలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పదవి కోసం పలువురు పోటీపడుతున్నారు. జిల్లాలోని ప్రముఖ ఆలయాల్లో పళ్లికొండేశ్వరాలయం ఒకటి. పైగా తమిళనాడు రాష్ట్ర సరిహద్దులో ఉండటంతో ఈ ఆలయ చైర్మన్ పదవికి పోటీ ఎక్కువగా ఉంటుంది. పాలకమండలి నియామకానికి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో ఆశావహులు పైస్థాయి నేతల ఆశీస్సుల కోసం ప్రయత్నాలు సాగిస్తున్నారు. కేవీబీపురానికి చెందిన తొట్టంబేడు ఏఎంసీ మాజీ చైర్మన్ రామాంజులు నాయుడి పేరు చైర్మన్ రేసులో ప్రముఖంగా వినబడుతోంది. పార్టీలో సీనియర్ నేత కావడంతో రాష్ట్రస్థాయి నేతల ఆశీస్సులు మెండుగా ఉన్నాయి. అదేవిధంగా పిచ్చాటూరు మండలానికి చెందిన మాజీ ఎంపీపీ పద్మనాభరాజు పేరు కూడా పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఆయన కూడా చైర్మన్ పదవి కోసం ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. నాగలాపురం మండలానికి చెందిన తిరుపతి పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు ఆవుల రామ్‌ప్రకాష్ యాదవ్ ఈ పదవి ఆశిస్తున్నట్లు సమాచారం. ఈయన ఇప్పటికే యువనేత లోకేశ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను సంప్రదించి దరఖాస్తు అందించి ఉన్నారు. ఇదిలా ఉండగా సత్యవేడుకు చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త సల్లా కృష్ణయ్య పేరు తెరమీదకు రావడం గమనార్హం. కృష్ణయ్య కుటుంబ సభ్యుల్లో ఒకరికి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌తో సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలో పదవి ఎవరిని వరిస్తుందో వేచి చూడాల్సి ఉంది.

రోడ్ల అభివృద్ధికి చర్యలు



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

చిల్లకూరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చిల్లకూరు మిక్సిడ్ కాలనీలోని రాయలసీమ ప్రాంతంలో రోడ్ల అభివృద్ధి చర్యలు తీసుకుంటున్నామని టీడీపీ నాయకులు చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, కొండా రామచంద్రారెడ్డి చెప్పారు. శనివారం స్థానిక రాయలసీమ ప్రాంతంలో టీడీపీ సీనియర్ నాయకుడు తానంకి నానాజీ సొంత నిధులతో చేస్తున్న రోడ్ల అభివృద్ధి పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఈ ప్రాంతవాసులు పలు సమస్యలను తానంకి నానాజీ దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఆయన తన సొంత నిధులు వెచ్చించి ముళ్ల చెట్లను తొలగించడంతో పాటు రోడ్ల అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. కార్యక్రమంలో దాసరి రాము, నెల్లూరు రామ్మూర్తి, బెల్లంకొండ సోమశేఖర్, రవి, బాబు తదితరులు పాల్గొన్నారు.

పార్కు పరిశీలన



పార్కును పరిశీలిస్తున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

నాయుడుపేట టౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ పార్కును నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పరిశీలించారు. శనివారం పట్టణంలోని ఓ శుభకార్యానికి హాజరైన అనంతరం ఆయన పార్కును సందర్శించారు. పార్కులోని శిలాఫలకం బోర్డు, ప్రధాన బోర్డులో మున్సిపల్ పార్కు అని ఉండటంతో నుడా పేరును కూడా కలపాలని మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ ద్వారా సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో నుడా నుంచి రూ.50 లక్షలు మంజూరు చేసి తన హయాంలోనే పార్కును అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. నుడా చైర్మన్ వెంట టీడీపీ నాయకులు కందల కృష్ణారెడ్డి, ఇమిడిశెట్టి వెంకటేశ్వర్లు, అత్తికాయల సుబ్రహ్మణ్యం, విన్నమాల రాజారెడ్డి, రహమాన్, సులేమాన్, కిషోర్, కృష్ణమూర్తి, కిరణ్, భాను, ఖలీల్, తదితరులు ఉన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణ



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న బహుజన ఐక్యవేదిక నాయకులు

కోట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొక్కుపాడులో నూతనంగా నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని బహుజన ఐక్యవేదిక నాయకులు తహసీల్దారు జయజయరావు చేతుల మీదుగా శనివారం రాత్రి ఆవిష్కరించారు. అందుకుముందు బహుజన ఐక్యవేదిక కార్యకర్తలు, అంబేడ్కర్ యువజన ప్రతినిధులు కోట బజారు సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం నుంచి కొక్కుపాడు వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కోట, చిట్టమూరు ఎంఈవోలు కృష్ణయ్య, మస్తానయ్య, బహుజన ఐక్యవేదిక నాయకులు మీజూరు మాధవ్, అవినాష్, రామకృష్ణ, సుందరం, బీటీపీ నేత పేర్నాటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్లు, రొట్టెల పంపిణీ



వృద్ధులకు పండ్లు, రొట్టెలు అందజేస్తున్న మహేష్‌బాబు అభిమానులు

నాయుడుపేట, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మేరీ వృద్ధాశ్రమంలో సినీ హీరో మహేష్‌బాబు జన్మదిన వేడుకలు శనివారం నిర్వహించారు. మహేష్‌బాబు అభిమాని జెమినీ కేక్ కట్‌చేసి పంపిణీ చేశారు. వృద్ధులకు పండ్లు, రొట్టెలు అందజేశారు. అనంతరం అన్నదానం చేశారు. పట్టణంలోని కూడలి ప్రాంతాల్లో పేదలకు ఆహార పొట్లాలను అందజేశారు. కార్యక్రమంలో మహేష్‌బాబు అభిమానులు తడుకు చెందు, శ్రావణ్‌కుమార్, రాజా, కళ్యాణ్, చరణ్, మజ్ను తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులు చదువులో రాణించాలి



సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థినులు

గూడూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు చదువులో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మినీ గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మేరీ ప్రియత అన్నారు. శనివారం పాఠశాలలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహించారు. బిర్సాముండా చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలందరూ చదువు కొనసాగించాలనే ఉద్దేశంతో ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలను అమలు పరుస్తున్నాయన్నారు. విద్యార్థినులు చదువులపై దృష్టి సారించి రాణించాలన్నారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంజలి, విద్యార్థినులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన

తిరుచానూరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): శిల్పారామంలో శనివారం నిర్వహించిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. వారాంతపు సెలవుల్లో భాగంగా చంద్రగిరికి చెందిన వెంకటేశ్వర నృత్యాలయం అకాడమీకి చెందిన కళాకారులు విష్ణుప్రియ, గుణప్రియ, ఆదర్శ ప్రియ, దర్శిని, నిహారిక, లెక్షన, నిహారిక, పూజశ్రీ, ముని గగన, హేమప్రియ తదితరులు పుష్పాంజలి, శంకర శశిధర, సీతారాముల కల్యాణం, కాళి కౌతువం శివతాండవం, సుబ్రహ్మణ్య కౌతవం, ప్రబంధం వంటి కీర్తనలకు నృత్య ప్రదర్శన చేశారు. వారిని శిల్పారామం ఏవో సూర్యతేజ అభినందించి జ్ఞాపిక, ప్రశంసాపత్రాలు అందజేశారు. రాయలసీమ రంగస్థల కళాకారుల సంఘం అధ్యక్షుడు గుండాల గోపీనాథ్ కళాకారులను అభినందించారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

ఓజిలి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం చిల్లమానుచేను గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి మిగిలిన సీట్లలో ప్రవేశానికి అర్హత ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ధనరాజ్ కోరారు. 5వ తరగతిలో 24 సీట్లు, 6వ తరగతిలో 4 సీట్లు, 8వ తరగతిలో 5 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈనెల 14వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు విద్యార్థుల ఆధార్, స్టడీ, కుల, ఆదాయం ధృవపత్రాలతో గురుకుల పాఠశాలకు వచ్చి పేర్ల నమోదు చేయించుకోవాలన్నారు. ఈ నెల 16వ తేదీ ఉదయం 10నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించి ప్రతిభ ఆదారంగా విద్యార్థులకు సీట్లు కేటాయించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

కాళంగి వంతెనపై భారీ వాహనాలు నడపొద్దు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



బస్సు యజమానుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ మురళీకృష్ణ

సూళ్లూరుపేట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట చెంగాళమ్మ ఆలయ సమీపంలో ఉన్న కాళంగి వంతెనపై భారీ వాహనాలు వెళ్లకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. శనివారం ఆంధ్రజ్యోతిలో 'కాళంగిపై కొత్త వంతెనకు మోక్షమెప్పుడో? శిథిలావస్థకు చేరిన బ్రిటీష్ కాలంనాటి బ్రిడ్జి' శీర్షిక కార్త ప్రచురితం కావడంతో పోలీసులు స్పందించారు. సీఐ మురళీకృష్ణ స్థానిక పోలీసు స్టేషన్‌లో పరిశ్రమలకు బస్సులు నడిపే ట్రావెల్స్ ప్రైవేట్ బస్సుల యజమానులతో సమావేశం నిర్వహించారు. కాళంగి బ్రిడ్జి మీదుగా పరిశ్రమలకు వెళ్లే బస్సులతో పాటు ఇతర భారీ వాహనాల రాకపోకలను నిషేధిస్తున్నట్లు తెలిపారు. బ్రిడ్జి శిథిలావస్థకు చేరినందున భద్రత నిమిత్తం ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమించి బ్రిడ్జి మీదుగా వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. అదే విధంగా బ్రిడ్జికి అవతలి వైపు రోడ్డుకు పక్కనే బస్సులు ఇతర వాహనాలు పార్కింగ్ చేయకూడదన్నారు. అలాగే పట్టణంలో రోడ్డు పక్కనే ప్రైవేట్ బస్సులు, ఇతర వాహనాలు పార్కింగ్ చేస్తే రూ.వెయ్యి జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో శ్రీసిటీ సీఐ శ్రీనివాసులు, శ్రీసిటీ సెక్యూరిటీ అధికారి రమేష్, తడ ఎస్ఐ కొండపనాయుడు, బస్సుల యజమానులు పాల్గొన్నారు.

జేవీవీ సేవలు స్ఫూర్తిదాయకం



గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ విఠపు

గూడూరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞానవేదిక నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. శనివారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో జేవీవీ ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవిజ్ఞానవేదిక సంస్థ ప్రజల్లో మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా పనిచేస్తూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తోందన్నారు. 12 ఏళ్లుగా ప్రతినెలా క్రమం తప్పకుండా గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వేగూరు రాజేంద్రప్రసాద్, డాక్టర్ షరీనా, చెంగయ్య, రెడ్డప్ప, నాగరాజు, చెంచునారాయణ, పురుషోత్తమ రావు, సుమన్‌రెడ్డి, రాధయ్య, రజనీకాంత్, అశోక్, బాబు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

చెంగాళమ్మ ఆలయంలో చండీయాగం



చండీయాగంలో ఉభయకర్త గోపాలకృష్ణ దంపతులు

సూళ్లూరుపేట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): తెలుగు, తమిళ భక్తుల ఆరాధ్య దైవమైన చెంగాళమ్మ ఆలయంలో పౌర్ణమి సందర్భంగా శనివారం మహా చండీయాగం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని యాగశాల మండపంలో అమ్మవారి ఉత్సవమూర్తి విగ్రహం ఏర్పాటు చేసి వేదపండితులు మంత్రోచ్చరణల నడుమ యాగాన్ని ఘనంగా చేశారు. చెన్నైకి చెందిన కడివేటి గోపాలకృష్ణ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. యాగం అనంతరం ఉభయకర్తలకు సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఇసుక ట్రాక్టర్ల తనిఖీ

నాయుడుపేట టౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పాత వెంకటగిరి రోడ్డు సమీపంలో ఇసుక ట్రాక్టర్లను అర్బన్ సీఐ బాబి శనివారం రాత్రి తనిఖీ చేశారు. సరైన ధృవీకరణ పత్రాలు లేని ట్రాక్టర్లపై కేసు నమోదు చేశారు.

13న ఉచిత ఫెర్టిలిటీ క్యాంప్

నాయుడుపేట, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ఇండియన్ బ్యాంక్ వెనుక ఉన్న మమత ఆస్పత్రిలో ఈనెల 13వ తేదీ బుధవారం ఉచిత ఫెర్టిలిటీ క్యాంప్‌ను నిర్వహించనున్నట్లు డాక్టర్ చెన్నూరు నిషిత తెలిపారు. ఉచితంగా ఫెర్టిలిటీ స్కానింగ్ చేయడంతో పాటు దంపతులకు కౌన్సెలింగ్ ఇస్తామన్నారు.

యువకుడిపై దాడి
పోలీసులకు ఫిర్యాదు



గాయపడిన మునిరాజ

పెళ్లకూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిమాల దళితవాడకు చెందిన ముళ్లపూడి మునిరాజుపై నల్లగుండ్లకండ్రిగ అరుందతి కాలనీకి చెందిన కృష్ణయ్య, శ్రీనివాసులు, రామయ్య కర్రలతో శనివారం దాడికి పాల్పడ్డారు. ఎస్ఐ, స్థానికులు తెలిపిన వివరాల మేరకు... గతకొద్ది రోజుల క్రితం నల్లగుండ్లకండ్రిగ వద్ద మోటార్ సైకిల్‌పై మునిరాజ, అతివేగంగా వెళ్లడంపై వివాదం చోటుచేసుకుంది. శనివారం కృష్ణయ్య, శ్రీనివాసులు, రామయ్య నందిమాల దళితకాలనీకి చేరుకుని ముళ్లపూడి మునిరాజుపై కర్రలతో దాడికి పాల్పడ్డారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు విచారిస్తున్నామని పోలీసులు తెలిపారు.

జనసేన నేత ప్రవీణ్‌కు రాఖీ కట్టిన ఎమ్మెల్యే



ఉయ్యాల ప్రవీణ్‌కు రాఖీ కడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

సూళ్లూరుపేట/నాయుడుపేట టౌన్: ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) సూళ్లూరుపేట పట్టణంలో శనివారం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఆధ్వర్యంలో రాఖీ పండుగను టీడీపీ కార్యకర్తలు, అభిమానుల మధ్య కోలా హలంగా నిర్వహించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్ కుమార్‌కు విజయశ్రీ రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే తెలుగు యువత నాయకుడు పోట్లపూడి రాజేష్‌కు ఎమ్మెల్యే రాఖీ కట్టారు.

కమనీయంగా శ్రీనివాస కల్యాణం



శ్రీనివాసకల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

కోట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్‌లో గల గరుడ్రాది గ్రీన్‌సిటీలో శనివారం రాత్రి శ్రీనివాస కల్యాణాన్ని వేదపండితులు జరిపించారు. విద్యానగర్‌తో పాటు కోట, గూడలి, క్రాస్‌రోడ్డు, చెందోడు గ్రామాలకు చెందిన భక్తులు స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. కార్యక్రమంలో రాఘవేంద్ర, రఘురామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విఖనస మహర్షి జయంతి

తిరుమల, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): అన్ని ఆగమాలకు మూలం వైఖనస ఆగమమేనని విఖనస మహర్షి సభలో పండితులు ఉద్ఘాటించారు. తిరుమలలో శనివారం విఖనస మహర్షి జయంతిని పురస్కరించుకుని ఆస్థానమండపంలో టీటీడీ ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్ట్, వైఖానస దివ్య సిద్ధాంత వివర్ధని సభ సంయుక్త ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. ఇందులో పండితులు మాట్లాడుతూ కల్పసూత్రం ద్వారా ఆవిర్భవించిందే వైఖానస ఆగమమన్నారు. తిరుమల శ్రీనివాసునికి వైఖనస ఆగమం ప్రకారమే అర్చనాదులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో దీవి శ్రీనివాస దీక్షితులు, ప్రొఫెసర్ వేదాంతం విష్ణుభట్టాచార్యులు, గంజాం ప్రభాకరాచార్యులు పాల్గొన్నారు.

అభయ శంకరుడి ఆలయంలో పూజలు

సూళ్లూరుపేట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోత): పౌర్ణమి పర్వదినం సందర్భంగా శనివారం టీడీపీ కార్యాలయం వద్దనున్న అభయ శంకరుడి ఆలయంలో అభిషేకం, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

చౌడేశ్వరిదేవికి ప్రత్యేక పూజలు



గూడూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరు గ్రామంలో శనివారం శ్రావణ పౌర్ణమి సందర్భంగా రామలింగ చౌడేశ్వరిదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని విశిష్ట రీతిలో పూలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ఆవరణలో అన్న ప్రసాద వితరణ జరిగింది.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



పెంచలయ్యకు చెక్కును అందజేస్తున్న టీడీపీ నాయకులు

కోట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడలి గ్రామానికి చెందిన పెంచలయ్యకు సీఎం సహాయనిధి నుంచి రూ.45,787 మంజూరైంది. శనివారం కోట క్రాస్‌రోడ్డులో పెంచలయ్యకు టీడీపీ నాయకులు చెక్కు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, జలీల్ అహ్మద్, మధుయాదవ్, వెంకటకృష్ణారెడ్డి, రఘునాథరెడ్డి, రఘురామయ్య, చోటే సాహెబ్ పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న ఏపీపీ ప్రకృతి కుమార్

వెంకటగిరి టౌన్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బంగారుపేట విష్ణుదుర్గ ఆలయంలో రాఖీ పూర్ణిమ పురస్కరించుకుని శనివారం స్వామి వివేకానంద యువసైన్యం నిర్వహకుడు ఏపీపీ ప్రకృతికుమార్ అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఓబయ్య, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

గూడూరులో...

గూడూరు అర్బన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో ప్రగతిసేవాసంస్థ ఆధ్వర్యంలో శనివారం సురేష్‌రెడ్డి దాతృత్వంతో పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, రాధయ్య, యశ్వంత్, కుమార్, నాగరాజు, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి పూజలు

చిల్లకూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండలం కలవకొండ గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పల్లకీసేవ జరిపి ఆలయ ఆవరణంలో మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు. భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది.

విద్యార్థినికి దుస్తుల అందజేత

గూడూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో ఉన్న బలిజ మహిళా సంక్షేమ సంఘ కార్యాలయంలో శనివారం హిమ అనే విద్యార్థినికి దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా సంఘ గౌరవాధ్యక్షురాలు సారంగం సులక్ష్మి మాట్లాడుతూ ప్రతిభ కలిగిన విద్యార్థినులకు ఆర్థికసాయం అందజేయడంతో పాటు వారిలో మనోధైర్యాన్ని పెంపొందించేందుక కృషి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో పద్మావతి, సువర్ణలక్ష్మి, అరుణ, ఉషా, లక్ష్మి, కల్పన, యమున, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మకు ఎమ్మెల్యే దంపతుల పూజలు

పెళ్లకూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెంబేడు గ్రామంలో నూతనంగా నిర్మించిన గంగమ్మ ఆలయంలో శనివారం విగ్రహ ప్రతిష్ఠ చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, ఆమె భర్త పార్థసారథి విచ్చేసి పూజలు నిర్వహించారు. వేదపండితుల ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్ర మంలో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, స్వర్ణముఖినది ఆనకట్ట ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్ నాయుడు, నాయకులు నేలవల్లి సిద్దులయ్య నాయుడు, వేలూరు హరి నాయుడు, మల్లికార్జునరెడ్డి, వేలూరు రమణయ్య, తిరుమల, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారి హారతి అందుకుంటున్న ఎమ్మెల్యే దంపతులు

చెన్నై సెంట్రల్ - గుమ్మిడిపూండి మధ్య
రేపు 19 సబర్బన్ రైళ్ల రద్దు

పెరంబూర్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): చెన్నై సెంట్రల్ - గూడూరు మార్గంలోని పొన్నేరి - కవరపేట మధ్య రైలు మార్గాల్లో మరమ్మతుల కారణంగా సోమవారం 19 సబర్బన్ రైళ్లు రద్దు చేస్తున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

- చెన్నై సెంట్రల్ నుంచి ఉదయం 10.30, 11.35 గంటలకు గుమ్మిడిపూండి వెళ్లే సబర్బన్ రైళ్లు, గుమ్మిడిపూండి నుంచి మధ్యాహ్నం 1, 2.30, 3.15 గంటలకు సెంట్రల్‌కు వెళ్లే సబర్బన్ రైళ్లు రద్దు.
- సెంట్రల్ నుంచి ఉదయం 10.15, మధ్యాహ్నం 12.10, 1.05గంటలకు సూళ్లూరుపేట వెళ్లే సబర్బన్ రైళ్లు, సూళ్లూరుపేట నుంచి మధ్యాహ్నం 1.15, 3.15, రాత్రి 9 గంటలకు చెన్నై వెళ్లే సబర్బన్ రైళ్లు రద్దు.
- చెన్నై బీచ్ నుంచి ఉదయం 9.40, మధ్యాహ్నం 12.40 గంటలకు గుమ్మిడిపూండికి వెళ్లే, గుమ్మిడిపూండి నుంచి ఉదయం 10.55 గంటలకు చెన్నై బీచ్‌కి వెళ్లే సబర్బన్ రైలు రద్దు.
- సూళ్లూరుపేట నుంచి మధ్యాహ్నం 3.50 గంటలకు నెల్లూరు వెళ్లే మెము, నెల్లూరు నుంచి సాయంత్రం 6.45 గంటలకు సూళ్లూరుపేట వెళ్లే మెము, సెంట్రల్ నుంచి రాత్రి 11.40 గంటలకు ఆవడి వెళ్లే సబర్బన్ రైళ్లు రద్దు.
- ప్రయాణికుల సౌకర్యార్థం సెంట్రల్ - పొన్నేరి ఉదయం 10.30, పొన్నేరి - సెంట్రల్ మధ్యాహ్నం 1.18, 3.33, చెన్నై బీచ్-పొన్నేరి మధ్యాహ్నం 12.40, సెంట్రల్ - మీంజూరు ఉదయం 11.35, మీంజూరు - సెంట్రల్ మధ్యాహ్నం 2.59గంటలకు ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది.

ఉరుములు... మెరుపులు... చిరుజల్లులే

తడ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఆకాశంలో నల్లటి మేఘాలు కమ్ముకొని ఉరుములు, మెరుపులతో భయపెట్టినా... చిరుజల్లులు తప్ప వర్షం కురవలేదు. శనివారం ఉదయం నుంచి ఎండ తక్కువగా ఉన్నా... వేడి గాలులు, సెగలతో జనాలను ఉక్కిరిబిక్కిరి చేసింది. మధ్యాహ్నం తరువాత ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై నల్లటి మబ్బులు అలుముకున్నాయి. చల్లటి గాలులు వీశాయి. పెద్దశబ్ధాలతో ఉరుములు, మెరుపులు రావడంతో భారీ వర్షం పడుతుందని జనం భావించారు. అయితే చిరుజల్లులు తప్ప వర్షం కురవలేదు. వారం రోజులుగా ఇలా ఎండ, వేడి సెగలతో జనం అల్లాడిపోతున్నారు.